# వాస్తవం డెయిలీ.కామ్

ఉన్నది ఉన్నట్లుగా

గురువారం 16.07.2026

డిజిటల్ పత్రిక

ఎడిటర్: ఎం.కృష్ణారెడ్డి(కె.ఆర్)


## తెలంగాణలో సర్ ప్రక్రియ ఆగస్టు 3 వరకు గడువు పొడిగింపు



**హైదరాబాద్ :** తెలంగాణలో సర్ నమోదు ప్రక్రియను కేంద్ర ఎన్నికల సం ఘం ఆగస్టు 3 వరకు పొడిగిం చింది. సెప్టెంబర్ 9 వరకు అభ్యంతరాల స్వీ కరణ, అక్టోబర్ 12న తుది ఓటరు జాబితా విడు దల చేస్తామని ప్రకటించిం ది. ఈనెల 24 వరకు ఉన్న ఎన్యూమరేషన్ ఫారాల స్వీకరణ గడువును ఆగస్టు 3వ తేదీవరకు పొడిగించింది.అనేక జిల్లాలో సర్‌పై అవగాహన లేక మందకోడిగా కొనసాగుతుండగా గడువు సమీ పిస్తుం డడంతో అనేక రాజకీయ పార్టీల నాయకులు, వివిధ సం ఘాల ప్రతిని ధులు ఎన్యూమ రేషన్ ఫారాల స్వీకరణను పొడిగించాలని రాష్ట్ర ఎన్నికల సంఘానికి వినతి పత్రాలు అందించాయి. దీంతో స్పందిం చిన కేంద్ర ఎన్నికల సంఘం ఈ గడువు పొడిగింపును ప్రకటించింది.

# ఆదిలోనే హంస పాదు
# హెల్త్ కార్డులు ఎక్కడ?








- డిజిటల్ హెల్త్ కార్డులు ఇంకా అందని వైనం
- నెట్‌వర్క్ ఆసుపత్రులతో పూర్తికాని ఒప్పందాలు
- సిద్ధం కాని మార్గదర్శకాలు

10

**ప్రభుత్వం ఒక పథకాన్ని ప్రకటించినప్పుడు ప్రజలు కేవలం ప్రకటనను కాదు, దాని వెనుక ఉన్న నమ్మకాన్ని విశ్వసిస్తారు. ముఖ్యంగా ప్రభుత్వ ఉద్యోగులు, పదవీ విరమణ చేసిన పెన్షనర్లు వంటి వర్గాలకు సంబంధించిన సంక్షేమ పథకాల విషయంలో ప్రభుత్వం ఇచ్చే హామీ ఒక పరిపాలనా ప్రకటన మాత్రమే కాదు, వారి జీవిత భద్రతకు ఇచ్చే హామీ కూడా. అలాంటి అత్యంత కీలకమైన ఆరోగ్య భద్రతా పథకమైన ఎంప్లాయీస్ హెల్త్ స్కీమ్ (ఈహెచ్ఎస్) అమలులో తెలంగాణ ప్రభుత్వం చూపిన నిర్లక్ష్యం మరోసారి ప్రభుత్వ వాగ్దానాల విశ్వసనీయతపై ప్రశ్నలు లేవనెత్తుతోంది. ప్రకటించిన తేదీకి డిజిటల్ హెల్త్ కార్డులు అందించలేకపోవడం, నెట్‌వర్క్ ఆసుపత్రులతో ఒప్పందాలు పూర్తి చేయకపోవడం, అమలు మార్గదర్శకాలు కూడా సిద్ధం చేయకపోవడం పరిపాలనా వైఫల్యానికి స్పష్టమైన ఉదాహరణ.**

**ప్రభుత్వ ఉద్యోగులు ప్రత్యేక సౌకర్యాలు కోరడం లేదు. వారి జీతాల నుంచి ప్రభుత్వం వసూలు చేస్తున్న నిధులకు తగిన సేవలు మాత్రమే కోరుతున్నారు. పెన్షనర్లు అదనపు వరాలు అడగడం లేదు. వృద్ధాప్యంలో అనారోగ్య భారాన్ని తగ్గించే కనీస ఆరోగ్య భద్రత మాత్రమే కోరుతున్నారు. ఇది వారి హక్కు, ప్రభుత్వ దయాదాక్షిణ్యం కాదు. అందువల్ల తెలంగాణ ప్రభుత్వం ఇకపై ఆలస్యం చేయకుండా ఈ హెల్త్ కార్డుల వ్యవహారాన్ని అత్యున్నత ప్రాధాన్యంతో తీసుకోవాలి. ముఖ్యమంత్రి స్వయంగా జోక్యం చేసుకుని నెట్‌వర్క్ ఆసుపత్రులు, ఉద్యోగ సంఘాలు, సంబంధిత అధికారులతో అత్యవసర సమావేశం నిర్వహించి అన్ని వివాదాలకు ముగింపు పలకాలి. ప్రకటించిన పథకం కాగితాలకే పరిమితం కాకుండా ప్రతి ఉద్యోగి, ప్రతి పెన్షనర్ చేతిలో పనిచేసే హెల్త్ కార్డుగా, అవసరమైన సమయంలో అందుబాటులో ఉండే నాణ్యమైన వైద్య సేవగా మారినప్పుడే ప్రభుత్వం ఇచ్చిన హామీకి నిజమైన అర్థం ఉంటుంది. అదే ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టే పరిపాలనకు అసలైన ప్రమాణం.**

## ఈనెలలోనే 50 నామినేటెడ్ పోస్టుల భర్తీ

### మహేశ్ గౌడ్ కీలక ప్రకటన



**హైదరాబాద్, జులై 15:** ఈ నెలలోనే 50 నామినేటెడ్ పదవులను భర్తీ చేస్తామని టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ ప్రకటించారు. ఈరోజు(బుధవారం) మీడియాతో నిర్వహిం చిన చిట్‌చాట్‌లో మాట్లాడుతూ.. గతంలో పనితీరు కనబరిచిన వారిని రెన్యూవల్ చేసే అవకాశం ఉందన్నారు. డీసీసీల పనితీరు బాగోలేకపోతే మార్చే అవకాశం ఉందని వెల్లడించారు. పార్టీ పదవులపై మీనాక్షి నటరాజన్‌తో చర్చించామని తెలిపారు. రెండు రోజుల్లో సీఎం రేవంత్‌రెడ్డితో భేటీ అవుతామన్నారు. రెన్యువల్ విషయంలో ఇంకా ఎలాంటి నిర్ణయం తీసుకోలేదని చెప్పారు. మండల కమిటీలో డీసీసీల రిపోర్ట్ ఫైనల్ అని స్పష్టం చేశారు.

## కార్పొరేట్‌కు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు

**వినూత్న ఆలోచనలు, ఆవిష్కరణలకు ప్రోత్సాహం**

**ఎఫ్‌డీఆర్ సైన్స్ సెంటర్ ప్రారంభోత్సవంలో మంత్రి శ్రీధర్ బాబు**

**హైదరాబాద్:** రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్ విద్యాసంస్థలకు దీటుగా తీర్చిదిద్దాలన్నదే తమ ప్రభుత్వ సంకల్పమని... ఆ దిశగా చిత్తశుద్ధితో కృషి చేస్తున్నామని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు అన్నారు. విద్య, వైద్య రంగాలకు అత్యంత ప్రాధాన్యమిస్తూ... విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథం, సృజనాత్మకతను పెంపొందించేలా ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగుతున్నామన్నారు. మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా అల్వాల్ జడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో ఫౌండేషన్ ఫర్ డెమోక్రటిక్ రిఫార్మ్స్ (ఎఫ్‌డీఆర్) సహకారంతో ఏర్పాటు చేసిన ఎఫ్‌డీఆర్ సైన్స్ సెంటర్‌ను బుధవారం ఆయన లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ... వినూత్న ఆలోచనలు, ఆవిష్కరణలకు ఊతమిచ్చేలా రాష్ట్రంలో సమగ్ర ఇన్నోవేషన్ ఎకోసిస్టమ్‌ను అభివృద్ధి చేస్తున్నామన్నారు. కొత్త ఐడియాలను ఆవిష్కరణలుగా... వాటిని సమాజానికి ఉపయోగపడే ఉత్పత్తులుగా తీర్చిదిద్దేందుకు టీ-హబ్, టీ-వర్క్స్, వీ-హబ్ ద్వారా అవసరమైన సహకారం అందిస్తున్నామన్నారు. నేటి ప్రపంచంలో అకడమిక్ డిగ్రీల కంటే కొత్త ఆలోచనలు, నైపుణ్యాలకు ఎక్కువ విలువ ఉందని... సృజనాత్మకతే విజయానికి అసలైన పునాది అని విద్యార్థులకు మార్గనిర్దేశం చేశారు. సైన్స్ అంటే ప్రశ్నించడం, కారణాలను అన్వేషించడమేనని... మన



చుట్టూ ఉన్న సమస్యలను శాస్త్రీయ దృక్పథంతో పరిశీలించి, వాటికి పరిష్కారాలు కనుగొనేందుకు ప్రయత్నించాలని వారికి సూచించారు. రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో ఈ తరహా సైన్స్ సెంటర్లను ఏర్పాటు చేసేందుకు ముందుకు రావాలని ఎఫ్‌డీఆర్ సంస్థ ప్రతినిధులను మంత్రి శ్రీధర్ బాబు కోరారు. ప్రభుత్వం తరఫున పూర్తి సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఎంపీలు ఈటెల రాజేందర్, విజయేంద్ర ప్రసాద్, ఎఫ్‌డీ



ఆర్ జనరల్ సెక్రటరీ జయప్రకాశ్ నారాయణ్ తదితరులు పాల్గొన్నారు.

## డ్రగ్స్‌ను అరికట్టేందుకు విద్యాసంస్థల్లో ప్రత్యేక నిఘా


**డీజీపీ ఆదేశాలు**

**హైదరాబాద్, జులై 15:** విద్యాసంస్థల్లో డ్రగ్స్‌పై జీరో టాలరెన్స్ విధానం అమలు చేయాలని ఈగల్ విభాగంలోని అధికారులకు తెలంగాణ డీజీపీ సి.వి. ఆనంద్ స్పష్టం చేశారు. డ్రగ్స్ నిరోధించడంపై బుధవారం హైదరాబాద్‌లోని డీజీపీ కార్యాలయంలో ఈగల్ అధికారులతో సి.వి. ఆనంద్ ఉన్నతస్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారు. రాష్ట్రంలోని అన్ని విద్యాసంస్థల్లో 'యాంటీ డ్రగ్స్ అండ్ సేఫ్టీ కమిటీలు' ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ప్రతి విద్యాసంస్థలో క్యాంపస్ సేఫ్టీ కో ఆర్డినేటర్ నియామకం తప్పనిసరిగా చేపట్టాలని సూచించారు. డ్రగ్స్ నిబంధనలు ఉల్లంఘించే విద్యాసంస్థలపై కఠిన చర్యలు తీసుకోవాలని.. అవసరమైతే గుర్తింపును రద్దు చేసేందుకు సిఫార్సు చేయాలని పేర్కొన్నారు. విద్యార్థుల భద్రతతోపాటు డ్రగ్స్ నివారణ చర్యలపై సేఫ్టీ కమిటీలు ప్రత్యేక నిఘా ఉంచాలన్నారు. డ్రగ్స్ నియంత్రణలో పోలీసు, విద్య, ఆరోగ్య శాఖలు సమన్వయంతో పనిచేయాలని అధికారులను డీజీపీ సి.వి. ఆనంద్ ఆదేశించారు. విద్యార్థులకు సైకాలజిస్టులు, కౌన్సెలర్ల సేవలను అందుబాటులోకి తీసుకురావాలని పేర్కొన్నారు. అలాగే తల్లిదండ్రుల భాగస్వామ్యంతో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని వివరించారు.పోలీసు, విద్య, ఆరోగ్య శాఖల సమన్వయంతో డ్రగ్స్ రహిత తెలంగాణే లక్ష్యమన్న తెలంగాణ డీజీపీ సి.వి. ఆనంద్ తెలిపారు. డ్రగ్స్ రహిత విద్యాసంస్థల కోసం త్వరలోనే స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసీజర్స్ విడుదల చేయనున్నారు. ప్రభుత్వానికి తుది ప్రతిపాదనలు సమర్పించే ముందు మరోసారి సమీక్ష సమావేశం నిర్వహించాలని ఈ సందర్భంగా నిర్ణయం తీసుకున్నారు. ఈ సమీక్షా సమావేశంలో ఈగల్ డైరెక్టర్ సందీప్ శాండిల్య, ఐజీ పద్మజా రెడ్డి,



ఎస్పీ గిరిధర్‌తోపాటు పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## దేశవ్యాప్తంగా మరో 9,911 ఎంబీబీఎస్ సీట్లు పెంపు



**న్యూఢిల్లీ :** నేషనల్ మెడికల్ కమిషన్(ఎన్ఎంసీ) 2026-27 విద్యా సంవత్సరానికి గాను అదనంగా 9,911 ఎంబీబీఎస్ సీట్లను మంజూరు చేసింది. దీంతో దేశవ్యాప్తంగా అందు బాటులో ఉన్న ఎంబీబీఎస్ సీట్ల సంఖ్య 1,36,939కి చేరింది. ఈ సీట్ల పెంపులో భాగంగా మొత్తం 823 వైద్య కళాశాలల్లో ప్రవేశాలు కల్పిం చనున్నారు. ఈ ఏడాది 25 నూతన వైద్య కళా శాలలకు అనుమతులు లభించాయి. రాష్ట్రాల వారీగా అదనంగా మంజూరైన ఎంబీ బీఎస్ సీట్ల సంఖ్య విషయానికి వస్తే.. కర్ణాటక-1,300, తమిళ నాడు-950, రాజ స్థాన్-900, పశ్చిమ బెంగాల్-825, తెలం గాణ-810, ఉత్తరప్ర దేశ్-800, బీహార్-740, మధ్యపదేశ్-420, మహారాష్ట్ర-400, ఆంధ్రప్ర దేశ్-375, జార్ఖండ్ 370గా ఉన్నాయి.

# ప్రేమ పేరుతో వేధింపులకు గురిచేసిన వ్యక్తి హత్య

**మాదాపూర్‌లో హోటల్ ఉద్యోగిపై దారుణ దాడి..చికిత్సకు తరలిస్తుండగా మృతి**

**కుమార్తెను వేధిస్తున్నాడనే అనుమానంతో కక్ష.. ఇద్దరు నిందితులపై హత్య కేసు నమోదు**

**వాస్తవం : శేరిలింగంపల్లి, జూలై 15 :**

మాదాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో హోటల్ ఉద్యోగిపై జరిగిన దాడి విషాదాంతమైంది. మృతుడు వరంగల్ జిల్లా వర్ధన్నపేట మండలం ఉప్పర్‌పల్లి గ్రామానికి చెందిన సెనేపల్లి భాస్కర్ (32)గా పోలీసులు గుర్తించారు. పోలీసుల వివరాల ప్రకారం ఇలా ఉన్నాయి, జూలై 14వ తేదీ రాత్రి సుమారు 11:47 గంటలకు ధృవ కాలేజ్ సమీపంలోని ఇమేజ్ గార్డెన్ రోడ్డులో ఉన్న శ్రీ శ్రీ సూట్స్ (నోమా) హోటల్ వద్ద గొడవ జరుగుతున్నట్లు డయల్-100కు సమాచారం అందింది. వెంటనే మాదాపూర్ పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని తీవ్రంగా గాయపడిన భాస్కర్‌ను గుర్తించారు. ప్రాథమిక విచారణలో, మృతుడు కొంతకాలంగా ప్రధాన నిందితుడు రాజు కుమార్తెను వేధిస్తున్నాడనే అనుమానంతో రాజు కక్ష పెంచుకున్నట్లు పోలీసులు తెలిపారు. ఈ నేపథ్యంలో తన బావ కుమారస్వామితో కలిసి కర్రలతో భాస్కర్‌పై దాడి చేసి అనంతరం పరారైనట్లు వెల్లడించారు. తీవ్రంగా గాయపడిన భాస్కర్‌ను చికిత్స నిమిత్తం కొండాపూర్ ఏరియా ఆసుపత్రికి తరలించగా, వైద్యులు పరిశీలించి జూలై 15 తెల్లవారు జామున 1:05 గంటలకు ఆసుపత్రికి తీసుకొచ్చే సమయానికే మృతి చెందినట్లు (బ్రాట్ డెడ్) ప్రకటించారు. నిందితులు రాజు, కుమారస్వామి ఇద్దరూ వరంగల్ జిల్లా హనుమకొండ ప్రాంతానికి చెందిన వారని, జూలై 14న హైదరాబాద్‌కు వచ్చి ఈ దాడికి పాల్పడి నట్లు పోలీసులు తెలిపారు. ఈ ఘటనపై మాదాపూర్ పోలీసులు కేసు నమోదు చేసి, పరారీలో ఉన్న నిందితుల కోసం గాలింపు చర్యలు చేపట్టారు.



# కాంగ్రెస్ నూతన పదాధికారులకు సన్మానం

**క్షేత్రస్థాయిలో పార్టీని బలోపేతం చేయాలి**

**ఎమ్మెల్సీ బసవరాజ్ సారయ్య**

**వాస్తవం : వరంగల్ ప్రతినిధి:**



వరంగల్ జిల్లా కాంగ్రెస్ కమిటీలో ఇటీవల నియామకం పొందిన నూతన పదాధికారులను మాజీ మంత్రివర్యులు, ఎమ్మెల్సీ బసవరాజ్ సారయ్య తన స్వగృహంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఉపాధ్యక్షులుగా నియమితులైన కూర తోట సదానందం, జన్ను ఆదామ్, ప్రధాన కార్యదర్శులుగా గోరంట్ల రాజు, కొయ్యడ ఉమా ప్రభాకర్, కార్యదర్శులుగా ధూపం సంపత్, దామెర సర్వేశం, గుళ్ళపల్లి హరికృష్ణ, పీసీ సభ్యుడిగా నలిగింటి బొబ్బిలి లను సారయ్య అభినందించారు. అనంతరం కొత్తగా బాధ్యతలు చేపట్టిన నాయకులను ఉద్దేశించి మాట్లాడిన ఎమ్మెల్సీ బసవరాజ్ సారయ్య, క్షేత్రస్థాయిలో కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న అన్ని సంక్షేమ పథకాలు ప్రతి పేదవాడికి చేరువయ్యేలా చూడాలని, వచ్చే కార్పొరేషన్ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థుల గెలుపుకు అందరూ కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో పీసీసీ డెలిగేట్ సభ్యుడు నల్గొండ రమేష్, మాజీ కార్పొరేటర్లు గుండేటి నరేంద్ర కుమార్, బసవరాజ్ శిరీష, జన్ను అరోహన్, తత్తరి లక్ష్మణ్, సీనియర్ కాంగ్రెస్ నాయకుడు బసవరాజ్ కుమారస్వామి, యూత్ కాంగ్రెస్ తూర్పు అధ్యక్షుడు ఎండి సలీం, సీనియర్ నాయకులు జన్ను రవి, కరాటే ప్రభాకర్, సోషల్ మీడియా కోఆర్డినేటర్ శ్రీమతి సోమలక్ష్మి, ఐఎన్టీయూసీ నాయకుడు బైర బోయిన చంద్రమౌళి, బొలుగుద్దు శ్రీని వాస్, బత్తిని లింగయ్య, గిన్నారపు రాజు, వెల్దండి లక్ష్మణ్, బొలుగుద్దు అనిల్ కుమార్, తోట బాలరాజు పాల్గొన్నారు.

# ఉపాధ్యాయుడి సస్పెన్షన్‌పై విద్యార్థుల ఆగ్రహం

**స్కూల్ ముందు ధర్నా**

**వాస్తవం : మద్దూరు**



సిద్దిపేట జిల్లా మద్దూరు మండలం లద్నూరు ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయుల సస్పెన్షన్ వ్యవహారం తీవ్ర కలకలం రేపింది. తమకు ఎంతగానో నచ్చిన ఉపాధ్యాయుడిపై వేటు వేయడాన్ని నిరసిస్తూ బుధవారం విద్యార్థులు,వారి తల్లిదండ్రులు పాఠశాల ముందు భారీ ధర్నాకు దిగారు. అసలేం జరిగిందంటే..గత శనివారం పాఠశాలలో ప్రతాప్, విష్ణుమూర్తి అనే ఇద్దరు ఉపాధ్యాయుల మధ్య ఘర్షణ చోటుచేసుకుంది. అయితే,ఈ ఘర్షణకు అసలు కారణమైన ఉపాధ్యాయుడు ఉపేందర్‌ను వదిలేసి, ప్రతాప్ మరియు విష్ణుమూర్తిలను అధికారులు సస్పెండ్ చేయడంపై తీవ్ర అభ్యంతరాలు వ్యక్తమవుతున్నాయి.విద్యార్థులు,తల్లిదండ్రుల ఆందోళన తమకు న్యాయం చేయాలంటూ విద్యార్థులు పాఠశాల గేటు ముందు బైఠాయించారు.ఉపేందర్ సార్ వద్దు..విష్ణు సార్ ముద్దు,మా విష్ణు సార్ మాకు కావాలి అంటూ పెద్ద పెట్టున నినాదాలు చేశారు. ఈ సందర్భంగా విద్యార్థుల తల్లిదండ్రులు మాట్లాడుతూ.. పాఠశాలలో పిల్లలకు ఎంతో అంకితభావంతో,మంచి విద్యను అందిస్తున్న విష్ణు సార్‌పై ఎలాంటి విచారణ లేకుండా సస్పెండ్ చేయడం దుర్మార్గమన్నారు.తప్పు చేసిన వారిని పక్కన పెట్టి, నిరపరాధి అయిన ఉపాధ్యాయుడిని శిక్షించడం ఏంటని అధికారులను ఆగ్రహంతో ప్రశ్నించారు. తక్షణమే విష్ణు సార్ సస్పెన్షన్‌ను ఎత్తివేసి, తిరిగి అదే పాఠశాలకు పంపాలని డిమాండ్ చేశారు.లేనిపక్షంలో ఆందోళనను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

# ఎమ్మెల్సీ డా. అద్దంకి దయాకర్‌కు మంత్రి హోదా దళిత సమాజానికి దక్కిన గౌరవం

**జాతీయ మాల మహానాడు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అధ్యక్షులు తోటమల్ల రమణమూర్తి, వర్కింగ్ కమిటీ అధ్యక్షులు ఎడెల్లి గణపతి, ఉపాధ్యక్షులు పల్లంటి రమేష్**

**వాస్తవం: చర్ల:**



జాతీయ మాల మహానాడు వ్యవస్థాపక అధ్యక్షులు, ఎమ్మెల్సీ, ప్రభుత్వ విప్ డా. అద్దంకి దయాకర్‌కు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మంత్రి హోదా కల్పిస్తూ ఉత్తర్వులు జారీ చేసిన సందర్భంగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లా జాతీయ మాల మహానాడు కమిటీ ఆధ్వర్యంలో చర్లలో హర్షోత్సాహాలు వెల్లువెత్తాయి.ఈ సందర్భంగా ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డికి జిల్లా కమిటీ ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేసింది. గత 30 ఏళ్లుగా దళిత, బహుజన, మాల సామాజిక వర్గాల హక్కుల కోసం, ఆత్మగౌరవం కోసం అవిరళంగా పోరాడుతున్న డా. అద్దంకి దయాకర్‌కు రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన ఈ గుర్తింపు చారిత్రాత్మకమని జిల్లా నాయకులు పేర్కొన్నారు.జిల్లా అధ్యక్షులు తోటమల్ల రమణమూర్తి మాట్లాడుతూ "డా. అద్దంకి దయాకర్ ఎమ్మెల్సీగా, ప్రభుత్వ విప్‌గా చేస్తున్న సేవలను గుర్తించి మంత్రి హోదా ఇచ్చిన సీఎం రేవంత్ రెడ్డి నిర్ణయం అభినందనీయం. ఇది రాష్ట్రంలోని కోట్లాది దళితులకు దక్కిన గౌరవం. దళితుల ఆత్మగౌరవాన్ని నిలబెట్టే దిశగా కాంగ్రెస్ ప్రభుత్వం వేస్తున్న అడుగులకు ఇది నిదర్శనం" అన్నారు.జిల్లా వర్కింగ్ కమిటీ అధ్యక్షులు ఎడెల్లి గణపతిలి మాట్లాడుతూ "భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని గిరిజన, దళిత ప్రాంతాల అభివృద్ధికి, సంక్షేమ పథకాల అమలుకు డా. దయాకర్ నాయకత్వం మరింత ఉపయోగపడుతుంది. కాంగ్రెస్ ప్రభుత్వం సామాజిక న్యాయా నికి ఇచ్చే ప్రాధాన్యతకు ఇది నిదర్శనం. ఎస్సీ కార్పొరేషన్, గురుకులాలు, ఇతర సంక్షేమ పథకాలకు మరింత నిధులు వస్తాయని ఆశిస్తున్నాం" అని తెలిపారు. జిల్లా ఉపాధ్యక్షులు పల్లంటి రమేష్ మాట్లాడుతూ "ఈ రోజు మా ఉద్యమ నాయకుడికి మంత్రి హోదా రావడం మాకు పండగ లాంటిది. డా. అద్దంకి దయాకర్ రోడ్లపై, అసెంబ్లీలో, ప్రతి చోటా దళితుల గొంతుగా ఉన్నారు. ఇప్పుడు మంత్రి హోదాతో ఆయన చేతికి మరింత అధికారం వచ్చింది. సీఎం రేవంత్ రెడ్డి తీసుకున్న ఈ నిర్ణయం చరిత్రలో నిలిచిపోతుంది" అని అన్నారు.ఈ నిర్ణయంతో రాష్ట్రంలో ఎస్సీ వర్గాల ఆకాంక్షలు నెరవేరడంతో పాటు, రిజర్వేషన్లు, విద్య, ఉపాధి రంగాల్లో మరిన్ని సంస్కరణలు వస్తాయని జిల్లా కమిటీ ఆశాభావం వ్యక్తం చేసింది.ఈ కార్యక్రమంలో జాతీయ మాల మహానాడు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కమిటీ సభ్యులు, మండల నాయకులు, కార్యకర్తలు పాల్గొని డా. అద్దంకి దయాకర్‌కు శుభాకాంక్షలు తెలియజేసి, స్వీట్లు పంపిణీ చేసి సంబరాలు జరుపుకున్నారు.

# గురుపౌర్ణమి పోస్టర్‌ని ఆవిష్కరించిన అదనపు డీసీపీ రాయల ప్రభాకర్ రావు

**-29న షిర్డీ తరహాలో అన్నదానం, పల్లకి ఉత్సవం**




**వాస్తవం : వరంగల్ ప్రతినిధి: జూలై 15**

వరంగల్ నగరంలో ఈ నెల 29-07-2026 న జరగనున్న సాయి సేవాదళ్ గురుపౌర్ణమి మహోత్సవాల పోస్టర్‌ను వరంగల్ లా అండ్ ఆర్డర్ ఉ ట్రాఫిక్ అదనపు డీసీపీ రాయల ప్రభాకర్ రావు బుధవారం తన కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సాయి సేవాదళ్ వారు నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాలు, అన్నదానం, ఆధ్యాత్మిక కార్యక్రమాలు అభినందనీయమని పేర్కొన్నారు. గురుపౌర్ణమి మహోత్సవాలు విజయవంతం కావాలని ఆకాంక్షిస్తూ.. నిర్వాహకులకు శుభాకాంక్షలు తెలిపారు. సాయి సేవాదళ్ అధ్యక్షులు ఆరుట్ల శ్రీనివాస్ మాట్లాడుతూ.. షిర్డీలో మాదిరిగా నాలుగు హారతులు, మధ్యాహ్నం 12 గంటలకు అన్నదానం, సాయంత్రం పల్లకి ఉత్సవం ను పెద్ద ఎత్తున నిర్వహిస్తున్నామని తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని గురుపౌర్ణమి వేడుకలను విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సాయి సేవాదళ్ ముఖ్య సభ్యులు పోలా మహేష్ స్వామి, చిట్టీమల్ల విజయ్ కుమార్, ఇరుకుల్ల నాగేశ్వర్ రావు, పబ్బ కిషోర్, వేముల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# ఉచిత నేత్ర వైద్య శిబిరం వాల్ పోస్టర్ ఆవిష్కరణ



**వాస్తవం : చెన్నూర్ ఆర్సీ**

చెన్నూర్ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఈ నెల 20-07-2026 సోమవారం మైనారిటీ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించనున్న ఉచిత నేత్ర వైద్య చికిత్స శిబిరం వాల్ పోస్టర్‌ను బుధవారం చెన్నూరు పట్టణ సీఐ బాన్సిలాల్ మరియు ఎస్సై రాజశేఖర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, లయన్స్ క్లబ్ చేపడుతున్న సేవా కార్యక్రమాలు సమాజానికి ఎంతో ఉపయోగకరమని కొనియాడారు. ముఖ్యంగా ఉచిత నేత్ర వైద్య శిబిరం ద్వారా ప్రజలు తమ కంటి ఆరోగ్యాన్ని పరీక్షించుకొని అవసరమైన చికిత్స పొందేందుకు ఇది మంచి అవకాశమని తెలిపారు. చెన్నూరు పట్టణంతో పాటు పరిసర ప్రాంతాల ప్రజలందరూ ఈ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. అలాగే చెన్నూర్ లయన్స్ క్లబ్ అందిస్తున్న సేవలను అభినందించారు.ఈ కార్యక్రమంలో జోన్ చైర్‌పర్సన్ జాడి తిరుపతి, ప్రెసిడెంట్ నిమ్మల సాగర్, సెక్రటరీ కప్ప ప్రతాప్ సింగ్, మదాసు కిష్టయ్య, కట్ట సదానందం,కట్ట కృష్ణమూర్తి, జక్కుల సత్యనారాయణ,ప్రహ్లాద రవీంద్రాచారి తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ ప్రభుత్వం అంటేనే సంక్షేమం

**మర్మముల సర్పంచ్ సుందరగిరి సత్యనారాయణ గౌడ్**

**లబ్ధిదారులకు 'ఇందిరమ్మ ఇల్లు' మంజూరు పత్రాల పంపిణీ**



**వాస్తవం : మద్దూరు**

మండల పరిధిలోని మర్మముల గ్రామంలో అర్హులైన లబ్ధిదారులు బుసరాజు రాజవ్వ, మల్యాల స్వాతికి ఇందిరమ్మ ఇల్లు మంజూరు పత్రాలను గ్రామ సర్పంచ్ సుందరగిరి సత్యనారాయణ గౌడ్, ఉపసర్పంచ్ బత్తిని సిద్దులు గౌడ్‌లతో కలిసి బుధవారం పంపిణీ చేశారు.గ్రామ పంచాయతీలో లబ్ధిదారుల మంజూరు పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ సుందరగిరి సత్యనారాయణ గౌడ్ మాట్లాడుతూ...కాంగ్రెస్ ప్రభుత్వం అంటేనే సంక్షేమ ప్రభుత్వమని కొనియాడారు. పేదవాడి సొంతింటి కల సాకారం చేయడమే ధ్యేయంగా ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తోందని అన్నారు.అర్హులైన ప్రతి ఒక్క పేద కుటుంబానికి ఇల్లు అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని, ఎలాంటి అవినీతికి తావు లేకుండా పారదర్శకంగా లబ్ధిదారులను ఎంపిక చేసినట్లు ఆయన తెలిపారు. గతంలో ఇచ్చిన మాట ప్రకారం కాంగ్రెస్ ప్రభుత్వం అర్హులకు ఇళ్లను మంజూరు చేస్తూ పేదల పక్షాన నిలిచిందని హర్షం వ్యక్తం చేశారు.నిరుపేదలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని,సొంతింటి కలను నిజం చేసుకోవాలని కోరారు.తమకు ఇందిరమ్మ ఇల్లు మంజూరు కావడం పట్ల లబ్ధిదారులు సంతోషం వ్యక్తం చేస్తూ ప్రభుత్వానికి,గ్రామ పాలకవర్గానికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి బస్వరాజు అశోక్ లబ్ధిదారులు పాల్గొన్నారు.

జర్నలిస్ట్స్ సంక్షేమ సంఘం
Red 914/2015
జర్నలిస్ట్స్ సంక్షేమమే పరమావధిగా
జర్నలిస్ట్స్ హక్కుల కోసం....
వాళ్ల ప్రగతి కోసం... పత్రికా స్వేచ్ఛ కోసం...
సభ్యత్వ నమోదు కోసం సంప్రదించండి సెల్ నెం॥ 9618616110

వాస్తవం



# విద్య ద్వారా ప్రయోజకులు కావాలి

**వనవాసీ విద్యార్థులకు కానిస్టేబుల్ ప్రసాద్ ఉద్బోధ**

**చర్ల : వాస్తవం**

విద్య ద్వారా ఉన్నత లక్ష్యాలను సాధించాలని, చిన్ననాటి నుండే స్పష్టమైన ప్రణాళికతో ముందుకు సాగాలని ములుగు జిల్లా వెంకటాపురం పోలీస్ స్టేషన్ కానిస్టేబుల్ వేమాల ప్రసాద్ వనవాసీ విద్యార్థులకు ఉద్బోధించారు. చర్లలోని వనవాసీ కళ్యాణ పరిషత్ కొమరం భీం నిలయంలో ప్రసాద్ – సునీత దంపతుల ద్వితీయ కుమారుడు నిహాల్ జన్మదిన వేడుకలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ఒక జత దుస్తులు, కంబాక్స్‌లు, పెన్నులు, పెన్సిళ్లు, పండ్లను అందజేశారు. కొమరం భీం నిలయ కార్యదర్శి జవ్వాది మురళీకృష్ణ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ప్రసాద్ మాట్లాడుతూ "ప్రతి విద్యార్థి చదువుపై దృష్టి సారించి ఉన్నత స్థితికి చేరుకోవాలి. మనం ఏమి కావాలో ముందుగానే నిర్ణయించుకొని కష్టపడితే ఏ లక్ష్యాన్నైనా సాధించవచ్చు. ఇక్కడి విద్యార్థుల క్రమశిక్షణ నన్ను ఎంతగానో ఆకట్టుకుంది. అందుకే వెంకటాపురంలో విధులు నిర్వహిస్తున్నా, నా కుమారుని జన్మదినాన్ని ఇక్కడే జరుపుకొని వితరణ చేశాను" అన్నారు. కార్యదర్శి జవ్వాది మురళీకృష్ణ మాట్లాడుతూ "జన్మదినాలు, ఇతర శుభకార్యాలకు డబ్బు వృథా చేయకుండా విద్యార్థులకు ఉపయోగపడేలా సహాయం చేయడం అభినందనీయం. మా సంస్థ ప్రభుత్వ సహాయం లేకుండా కేవలం దాతల సహకారంతోనే నడుస్తోంది. గిరిజనుల అభ్యున్నతి కోసం దేశవ్యాప్తంగా వనవాసీ విద్యార్థి నిలయాలు నడుపుతున్నాం" అని తెలిపారు. విద్యతోనే వినయం, విధేయత వస్తాయని, కుటుంబంలో ఒక్కరు చదివి స్థిరపడితే ఆ కుటుంబం మొత్తం అభివృద్ధి చెందుతుందని అన్నారు. గిరిజన విద్యార్థుల సంక్షేమానికి దాతలు తమవంతు సహకారం అందించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా సహ కార్యదర్శి గోగికార్ రాం లక్ష్మణ్, జిల్లా సంఘటనా సహ కార్యదర్శి గొంది శోభన్ బాబు, కొమరం భీం నిలయ ప్రముఖ్ ఆకుల సాంబయ్య, శబరి బాలికా నిలయ ప్రముఖ్ వరలక్ష్మి, మడకం చందు, కూడం ఉంగయ్య, వేమాల సునీతతో పాటు ప్రసాద్ కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.





## ప్రాథమిక పాఠశాలకు గ్రిల్స్ విరాళం




**వాస్తవం : చందుర్తి**

చందర్తి మండలం ఎన్గల్ గ్రామ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలకు కీర్తిశేషులు మొకిడె అంజయ్య జ్ఞాపకార్థం కుమారులు అనిల్ కుమార్, ప్రవీణ్ కుమార్ లు రూ. 20 వేలవిలువైన ఇనుప గ్రిల్స్ కోతుల బెడద లేకుండా బిల్డింగ్ ఫస్ట్ ఫ్లోర్‌కి అమర్చించారు. వారికి ఎన్గల్ పాఠశాల ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు హృదయ పూర్వక ధన్యవాదములు, అభినందనలతో ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

## డ్రంక్ అండ్ డ్రైవ్‌లో ఇద్దరికి జైలు శిక్ష

**వాస్తవం : గోదావరిఖని**



రామగుండం ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ రాజేశ్వరరావు ఆధ్వర్యంలో డ్రంక్ అండ్ డ్రైవ్‌లో దొరికిన 11 మందిని సెకండ్ అడిషనల్ కోర్టు మేజిస్ట్రేట్ గోదావరిఖని శ్రీంజా కోహిర్కర్ ముందు హాజరుపరుచగా 9 మందికి 15500 రూపాయల జరిమానా విధించారు. ఇద్దరికి ఒక వ్యక్తికి ఆటో డ్రైవర్‌గా పని చేస్తున్న ఒక వ్యక్తికి 01 రోజుల జైలు శిక్ష విధించారు మరొకరు వ్యక్తికి ఆటో డ్రైవర్‌గా పని చేస్తున్న వ్యక్తికి రెండు రోజుల జైలు శిక్ష విధించారు. వీరిని కరీంనగర్ జిల్లా జైలుకు తరలించారు. సీఐ మాట్లాడుతూ వాహనం మద్యం తాగి వాహనం నడప రాదని నడిపినచో వారిపై చట్టరీత్యా చర్య తీసుకున్నారు. వాహనానికి సంబంధించిన పత్రములు మరియు టూ వీలర్ వెహికల్స్ నడిపేవారు హెల్మెట్ తప్పని సరిగా ధరించాలని , రాంగ్ రూట్లో వెళ్లరాదని ట్రాఫిక్ ని బంధనలు పాటించాలని వాహనాన్ని అతివేగంగా నడప రాదని ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

## నెలాఖరులోగా వైద్య కళాశాల

# భవన నిర్మాణ పనులు పూర్తి చేయాలి





**కలెక్టర్ రాహుల్ శర్మ**

**వాస్తవం : భూపాలపల్లి**

జయశంకర్ భూపాలపల్లి జిల్లా వైద్య కళాశాల భవన నిర్మాణ పనులను ఈ నెలాఖరులోగా పూర్తి చేసి పూర్తి స్థాయిలో అప్పగించాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం ఐడీఓసీ కార్యాలయంలో ఆర్ అండ్ బి, వైద్య కళాశాల, టీజీఎంఐడీసీ అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. వైద్య కళాశాల నిర్మాణ పనులను వేగవంతం చేస్తూనా ణ్యత ప్రమాణాలు పాటించి నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని సూచించారు. మిగిలిన పనులపై ప్రత్యేక దృష్టి సారించి రోజువారీగా పురోగతిని సమీక్షించాలని తెలిపారు. విద్యుత్, తాగునీటి సరఫరా, అంతర్గత రహదారులు, పారిశుద్ధ్యం వంటి మౌలిక వసతులను సకాలంలో అందుబాటులోకి తీసుకు రావాలని ఆదేశించారు. అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసి నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని స్పష్టం చేశారు. అలాగే వైద్య కళాశాల హాస్టల్ నిర్మాణ పనులను కూడా సెప్టెంబర్ నెలాఖరులోగా పూర్తి చేయాలని సూచించారు. సమావేశంలో ఆర్ అండ్ బి ఈఈ రమేష్, వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డా. వెంకటేశ్వర రావు, కెపీసీ ప్రత్యేక ఇంజినీర్ శివరామ్ తదితరులు పాల్గొన్నారు.

## స్వాతంత్రోద్యమ ధీశాలి దుర్గాబాయి జయంతి

**వాస్తవం : వేములవాడ**

భారత స్వాతంత్ర్య సమరయోధురాలు, సంఘసంస్కర్త, న్యాయవాది దుర్గాబాయి దేశ్‌ముఖ్ 117 వ జయంతి సందర్భంగా వేములవాడ పట్టణంలోని న్యూ అర్బన్ కాలనీ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు విక్కుర్తి లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో బుధవారం దుర్గాబాయి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా విక్కుర్తి లక్ష్మీనారాయణ మాట్లాడుతూ.... దుర్గాబాయి 1909 జూలై 15 న ఆంధ్రప్రదేశ్‌లోని రాజమహేంద్రవరంలో జన్మించారని, చిన్నతనంలోనే ఇంగ్లీష్ మాధ్యమాన్ని వ్యతిరేకిస్తూ పాఠశాలను బహిష్కరించారని, గాంధీజీ స్ఫూర్తితో స్వాతంత్ర్య ఉద్యమంలో పాల్గొని ఉప్పుసత్యాగ్రమంలో చురుగ్గా వ్యవహరించి పలుమార్లు జైలు శిక్ష అనుభవించారని, జైలు జీవితంలోనే ఉన్నత చదువులు పూర్తి చేసి, మద్రాసు హైకోర్టులో న్యాయవాదిగా ప్రాక్టీసు చేశారని, మహిళల అభ్యున్నతి కోసం 1937 లో 'ఆంధ్ర మహిళా సభ'ను స్థాపించారని, దీని ద్వారా ఎంతోమంది మహిళలకు ఉచిత న్యాయ సహాయం, విద్య,



వృత్తి శిక్షణ అందించారని ఉన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాలఉపాధ్యాయులు దుర్శేటి లక్ష్మీనారాయణ, దాసరి సుజాత, అంగన్ వాడీ ఉపాధ్యాయురాలు లిక్కిడి మంజుల, పులి శారద పాల్గొన్నారు.

# బీఆర్ఎస్ బలోపేతానికి

# కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలి

**ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు మాజీ కార్పొరేటర్ బొబ్బా నవతారెడ్డి ఆధ్వర్యంలో చందానగర్‌లో సర్ బూత్ కమిటీ కార్యకర్తల సమావేశం**

**వాస్తవం : శేరిలింగంపల్లి, జూలై 15 :**

శేరిలింగంపల్లి నియోజకవర్గంలో భారత ఎన్నికల సంఘం చేపట్టిన ఎస్ఐఆర్ (స్పెషల్ ఇంటెన్సివ్ రివేషన్) కార్యక్రమం నేపథ్యంలో బూత్ కమిటీ కార్యకర్తల సమావేశం ఘనంగా నిర్వహించారు. ఈ సమావేశానికి శేరిలింగంపల్లి నియోజక వర్గ బీఆర్ఎస్ పార్టీ ఇన్‌చార్జ్, కూకట్ పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు ము ఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సంద ర్భంగా ఆయనకు పార్టీ నాయకులు, కా ర్యకర్తలు ఘన స్వాగతం పలికి సన్మానిం చారు. ఈ కార్యక్రమంలో చందానగర్ మాజీ కార్పొరేటర్, న్యాయవాది బొబ్బ నవతా రెడ్డి పాల్గొని బూత్ స్థాయిలో పార్టీని మరింత బలోపేతం చేయడానికి కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని పిలుపునిచ్చారు. ఎన్నికల సంఘం నిర్వ హిస్తున్న ఎస్ఐఆర్ ప్రక్రియపై ప్రజలకు పూర్తి అవగాహన కల్పించి, ప్రతి అర్హుడైన ఓటరు పేరు ఓటరు జాబితాలో నమోదు అయ్యేలా బూత్ కమిటీ సభ్యులు చొరవ చూపాలని సూచించారు. మాధవరం కృష్ణారావు మాట్లాడుతూ.. శేరిలింగంపల్లి నియోజకవర్గంలో పార్టీని మరింత బలోపేతం చేయడంలో బూత్ కమిటీల పాత్ర అత్యంత కీలకమని అన్నారు. ప్రతి కార్యకర్త ప్రజలతో నిరంతరం మమేకమై పార్టీ సిద్ధాంతాలు, కార్యక్రమాలను ప్రజల లోకి తీసుకెళ్లాలని, ఎన్నికల సంఘం చేప ట్టిన ఎస్ఐఆర్ కార్యక్రమంలో ప్రజలకు అవసరమైన సహాయం అందించాలని కోరారు. అనంతరం పార్టీ నాయకులు,



కార్యకర్తలు రానున్న రోజులలో బూత్ స్థాయిలో విస్తృతంగా సమావేశాలు నిర్వ హించి పార్టీని క్షేత్రస్థాయిలో మరింత బలోపేతం చేయాలని నిర్ణయించారు. ఈ సమావేశంలో మాజీ కార్పొరేటర్ కొమీరి శెట్టి సాయిబాబా, మాధవరం రంగా రావు,టిఆర్ఎస్ నాయకుడు పార్ నంది శ్రీకాంత్, నరేంద్ర యాదవ్, మిద్దెల మల్లారెడ్డి రాజు మల్లికార్జున్ శర్మ , దొం తి చిన్న, స్థానిక బీఆర్ఎస్ నాయకులు, బూత్ కమిటీ సభ్యులు, మహిళా నాయ కులు, పాల్గొన్నారు

# మదీనా మస్జీద్ ఆవరణలో స్వచ్ఛ కార్యక్రమం

**చెట్ల పొదలను తొలగించిన డివిజన్ కార్పొరేటర్ దొంత శ్రీనివాస్**



**వాస్తవం : గోదావరిఖని, జులై,15**

మున్సిపల్ పరిధి స్థానిక 43వ డివిజన్‌లో ఫైవ్ ఇంక్లైన్ ఏరియా మదీనా మస్జీద్ ఆవ రణలో పొదులు వేపుగా పెరిగి మసీదులో ప్రార్థనలకు వచ్చే వారికి ఇబ్బందులకు గుర వుతున్నారని మజీద్ పెద్దలు కమిటీ సభ్యులు కార్పొరేటర్ దృష్టికి తీసుకురావడంతో స్పందించిన కార్పొరేటర్ దొంత శ్రీనివాస్ బుధవారం స్వచ్ఛ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ దొంత శ్రీనివాస్ మాట్లాడుతూ డివిజన్‌లో ముస్లిం సోదరులు మజీద్‌లో ప్రార్థనలకు వచ్చే వారికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా మదీనా మస్జీ ద్ ఆవరణలో చెట్ల పొదలను తొలగించడం కోసం సహకరించినటువంటి ప్రతి ఒక్క రికి ముస్లింలు మదిన మజీద్ కమిటీ సభ్యుల పక్షాన ప్రత్యేక కృతజ్ఞతలు తెలియ జేశా రు. ఈ కార్యక్రమంలో వీణ బాబుమియా, మదీనా మజీద్ హిమాం, మస్జిద్ కమిటీ సభ్యులు వీణ ఉమర్ తదితరులు పాల్గొన్నారు.

## ఎల్‌నినో ప్రభావంతో ప్రత్యామ్నాయ పంటల సాగుపై అవగాహన



**వాస్తవం -గంగాధర జూలై15:** గంగాధర మండలం ముప్పిడిపల్లి గ్రామపంచాయతీలో బుధవారం గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయ విస్తరణ అధికారి (ఇూజుూ) సౌమ్య మాట్లాడుతూ, ఎల్‌నినో ప్రభావం కారణంగా మండలంలో సాధారణం కంటే తక్కువ వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉందని, అధిక ఉష్ణోగ్రతలు కూడా నమోదయ్యే అవకాశమున్నందున రైతులు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచిం చారు. నీటి పారుదల సౌకర్యం ఉన్న భూముల్లో మాత్రమే వరి సాగు చేపట్టాలని, నీటి ఎద్దడిని తట్టుకునే పంటలకు ప్రాధాన్యం ఇవ్వాలని రైతులకు వివరించారు. ప్రత్యామ్నా యంగా కంది, ఉలవలు, అనుములు, కూరగాయలు, నూనెగింజల పంటల సాగు చేపట్టాలని సూచించారు. ఈ గ్రామసభలో సర్పంచ్, పంచాయతీ కార్యదర్శి, వార్డు సభ్యులు, గ్రామ రైతులు పాల్గొన్నారు.

# బడి పిల్లల ప్రాణాలతో చెలగాటం

**కొంత మంది ప్రైవేటు బడుల యాజమాన్యాల నిర్లక్ష్యం**

**లైసెన్స్ లేని డ్రైవర్లతో విధుల నిర్వహణ**

**ఆర్టీవో అధికారుల నిర్లక్ష్యం..**

**తల్లిదండ్రుల ఆగ్రహం**

**వాస్తవం : మందమర్రి :**

మంచిర్యాల జిల్లా మందమర్రి పట్ట ణం లో ప్రైవేటు బడులు నిర్వహిస్తున్న యజమానులు, బడి పిల్లల రవాణా సౌ కర్యం కొరకు ఉపయోగిస్తున్న పాఠశాల బస్సులకు లైసెన్సు లేని డ్రైవర్లను విధు ల్లోకి తీసుకొని, గత కొంతకాలంగా విధులు నిర్వహింప చేస్తున్నారని పట్టణ ప్రజలందరూ.. బహిరంగంగానే చర్చించు కుంటున్నారు. ఇలా లైసెన్స్ లేని డ్రైవ ర్లను బస్సు డ్రైవర్లుగా పెట్టుకొని అరకొర జీతం ఇస్తూ..పసి పిల్లల ప్రాణాలతో చెల గాటమాడుతున్నారంటూ..విద్యార్థుల తల్లి దండ్రులు ఆవేదన చెందుతున్నారు. ఇప్పటికైనా.. మంచిర్యాల జిల్లా ఆర్టీవో అధికారులు బడి పిల్లల బస్సులపై లైసెన్స్ లేని డ్రైవర్లను విధుల్లోకి తీసుకుంటున్న యాజమాన్యాలపై అదేవిధంగా వాహన చోదకులపై చట్టపరమైన చర్యలు తీసుకో నట్లయితే.. ఆర్టీవో అధికారులు బదనాం అయ్యే అవకాశం ఉంది. దీనికి తోడు వారి ఉద్యోగ భద్రతకు భంగం వాటిల్లే ప్రమాదం కూడా ఉంటుందంటూ.. అభిప్రాయపడుతున్నారు. మందమర్రి పట్టణంలో పాత బస్టాండు అదేవిధంగా పాల చెట్టు ఏరియాలలో రోజుకో చోట ఉదయం ,సాయంత్రం పూట విరివిగా.. కాపు కాసి ,ఈ లైసెన్స్ లేని డ్రైవర్ల , యాజమాన్యాల బాగోతం బయట పె ట్టాలని. అదేవిధంగా ..వీరి పైన చట్టప రమైన చర్యలు తీసుకోవాలంటూ విద్యా ర్థుల తల్లిదండ్రులు వారి అభిప్రాయాన్ని తెలియపరుస్తున్నారు. లేనిపక్షంలో.. భారీ రోడ్డు ప్రమాదం సంభవించి పసి పిల్లల ప్రాణాలు గాల్లో కలిసే అవకాశం ఉం దంటున్నారు. ప్రమాదం సంభవించి ప్రాణ నష్టం సంభవించిన తర్వాత హుటా




హుటిన అధికారులు రావడం కంటే.. ప్ర మాదం జరగక ముందే చర్యలు తీసు కోవాలని పట్టణ మేధావులు, విద్యావేత్తలు ,పలు రాజకీయ పార్టీల నాయకులు , ప ట్టణ కుల సంఘాల నాయకులు , మ హిళలు, విద్యార్థుల తల్లిదండ్రులు అభి ప్రాయపడుతున్నారు.

## వర్షాలు కురవాలని గ్రామదేవతలకు జలాభిషేకం



**వాస్తవం : చందుర్తి**

వర్షాలు లేకపోవడంతో చందుర్తి మండలం తిమ్మాపూర్ గ్రామంలో రైతులు, గ్రామస్తులు బుధవారం గ్రామదేవతలకు జలాభిషేకం నిర్వహించారు. గ్రామ సర్పంచ్ కపిల శం కర్ ఆధ్వర్యంలో గ్రామ అభివృద్ధి కమిటీ, యువకులు, అన్ని కుల సంఘాల నాయ కులతో కప్పతల్లి ఆట ఆడి గ్రామ దేవతలకు జలాభిషేకం చేసి, వర్షాలు సమృద్ధిగా కురవాలని పాడిపంటలు బాగుండాలని ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కపిల శంకర్, విడిసి అధ్యక్షులు నల్లపు దివాకర్, ముద్దసాని వెంకటేష్, ఎడ్ల కుషాలు, గాలిపల్లె ఎల్లయ్య, గడిగోప్పుల శ్రీనివాస్ బుర్రి తిరుపతి, అట్టపెల్లి సతీష్, నాయకులు పాల్గొన్నారు.

# రియాజ్ అహ్మద్ నోరు అదుపులో పెట్టుకో

**ఏఐటియుసిపై విమర్శలు మానుకోవాలి**

**ఏఐటియుసి కేంద్ర కార్యదర్శి కవ్వంపల్లి స్వామి**

**వాస్తవం , గోదావరిఖని, జులై,15.**

సింగరేణిలో కార్మికుల సమస్యల పరిష్కా రం కోసం కృషి చేస్తున్న ఏఐటియుసిపై అనవసర విమర్శలు చేయడం రియాజ్ అహ్మద్ మానుకోవాలని, నోరు అదుపులో పెట్టుకొని మాట్లాడాలని ఏఐటియుసి కేం ద్ర కార్యదర్శి కామ్రేడ్ కవ్వంపల్లి స్వామి, హెచ్చరించారు. బుధవారం గోదావరిఖని భాస్కర్ రావు భవనలో జరిగిన ఏఐటియు సి ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయ న మాట్లాడుతూ, సింగరేణిలో ఇప్పటి వరకు జరిగిన 7 సార్ల గుర్తింపు సంఘం ఎన్నికల్లో 4 సార్లు ఏఐటియుసి గెలిచిం దని, కార్మికుల సమస్యల పరిష్కారం కోసం ఎన్నో అగ్రిమెంట్‌లు చేసిన చరిత్ర ఏఐటియుసికి ఉందని అన్నారు. సిం గరేణిలో 7వ సారి జరిగిన గుర్తింపు సంఘం ఎన్నికల్లో ఒక్క ఏరియాలో కూడా గెలవని హెచ్ ఎం ఎస్ యూ నియన్ కార్మిక హక్కుల సాధన కోసం, సంస్థ పరిరక్షణ కోసం కృషి చేస్తున్న ఏఐటియుసి నాయకులపై రియాజ్ అహ్మద్ వ్యక్తిగత దూషణలకు దిగడం సరైనది కాదని అన్నారు. బీఆర్ఎస్‌లో ఎంపీగా, ఎమ్మెల్సీగా ఉండగా, టీబిజికె ఎస్‌లో గౌరవ అధ్యక్షురాలిగా 10 సంవ త్సరాలు అధికారంలో ఉన్న కవిత సింగరేణి కార్మికులకు, సింగరేణికి ఏమీ చేయలేదని విమర్శించారు. బీఆర్ఎస్ పార్టీ నుంచి బయటకు వచ్చి తెలంగాణ రక్షణ సేన పార్టీ పేరుతో, హెచ్ఎంఎస్‌కు గౌరవ అధ్యక్షురాలిగా ఉంటున్న కవిత



వల్ల సింగరేణికి, కార్మికులకు ఒరిగేది ఏమీ లేదన్నారు. సింగరేణిలో ఏఐటియుసి అధికారంలో ఉన్నా, లేకున్నా నిరంతరం బాయి బాట పడుతుందని, కార్మికుల మధ్య ఉంటూ వారి సమస్యల పరిష్కారం కోసం ఏఐటియుసి పోరాటాలు, ఉద్యమా లు నిర్వహించి, యాజమాన్యం, ప్రభు త్వ ం మెడలు వంచి ఎన్నో హక్కులు సాధిం చిన సంఘం అని ఆయన తెలిపారు. హెచ్ ఎం ఎస్ యూనియన్ 'బాయి బా ట' పేరుతో కవితను సింగరేణిలో తిప్పి ఏఐటియుసి పై విమర్శలు చేయడం వల్ల కార్మికులు అన్నీ గమనిస్తున్నారని అన్నా రు. ఇకనైనా హెచ్ఎంఎస్ రియాజ్ అహ్మ ద్ ఏఐటియుసి పై విమర్శలు మాను కోవాలని ఆయన హితవు పలికారు. ఈ సమావేశంలో ఏఐటియుసి ఆర్జీ వన్ బ్రాంచి ఆఫీస్ బేరర్ సిర్ర మల్లికార్జున్, నాయకులు ఎర్రగొల్ల చేరాలు,పడాల కనకరాజు, తదితరులు పాల్గొన్నారు.

## ఓటరు ఎన్యుమరేషన్

# త్వరగా పూర్తి చేయండి

**వాస్తవం : మద్దూరు**



ప్రత్యేక ఓటర్ల సవరణ ప్రక్రియలో భాగంగా మండలంలోని ఓటర్లందరూ తమ పరిధిలోని బీఎల్‌ఓలు అందజేసిన ఎన్యుమరేషన్ ఫారమ్‌లను తక్షణమే పూర్తి చేసి అప్పగించాలని మద్దూరు తహశీల్దార్ మరియు సహాయ ఓటర్ల నమోదు అధికారి ఒక ప్రకటనలో కోరారు. ఓటర్లు సమర్పించిన ఫారమ్ లను బీఎల్‌ఓలు పరిశీలించి ఆన్‌లైన్ చేయాల్సి ఉంటుందని, ఈ ప్రక్రియకు సమయం చాలా తక్కువగా ఉందని ఆయన పేర్కొన్నారు. నిర్ణీత గడువులోగా ఫార మ్‌లను ఆన్‌లైన్ చేయని పక్షంలో ఓట ర్లు తమ ఓటు హక్కును కోల్పోయే ప్రమాదం ఉందన్నారు. కాబట్టి ఓటర్లు ఎవరూ నిర్ల క్ష్యం వహించకుండా, వెంటనే తమ ప్రాంత బీఎల్‌ఓలను సంప్రదించి పూర్తి చేసిన ఫారమ్‌లను అందజేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

## ఉన్ని సహకార సంఘం డైరెక్టర్ స్థానానికి

# బీర్ల శివశంకర్ నామినేషన్

**వాస్తవం : అందోల్**



జోగిపేట ఉన్ని సహకార సంఘం ఎన్నికల్లో డైరెక్టర్ స్థానానికి జోగిపేట పట్ట ణం చెందిన బిర్ల శివశంకర్ బుధవారం తన నామినేషన్ను దాఖలు చేశారు. స్థానిక సంఘం కార్యాలయంలో ఏర్పాటు చేసిన నామినేషన్ల స్వీక రణ కేంద్రానికి వెళ్లి కుల పెద్దలతో కలిసి నామినేషన్ వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 21వ తేదీన జరగబోయే సహకార సంఘం ఎన్నికల్లో తన అభ్యర్థిత్వాన్ని ఓటర్లు బల పరచాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఎన్నికల్లో తనకు మెజార్టీ ఓటు వేసి గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. సంఘం అభివృద్ధికి, కులస్తుల బలోపేతానికి ధనవంతు కృషి చేస్తానని ఆయన తెలిపారు. ఆయన వెంట కుల పెద్దలు రేవెల్లి చెన్నయ్య, కడల లక్ష్మీనారాయణ, రేవల్లి శివరాజ్ తదితరులు ఉన్నారు.

## ఆటోల యజమానులు, డ్రైవర్‌లకు హెల్త్ కార్డులు పంపిణీ

**-చల్మడ చారిటబుల్ ట్రస్ట్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు**



**వాస్తవం : చందుర్తి**

చల్మడ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆటోల యజమానులు, డ్రైవర్‌లకు అందించిన హెల్త్ కార్డులను చందుర్తి మండల కేంద్రంలో బుధవారం పంపిణీ చేశారు. ఆటోలకు ఐదు లక్షల హెల్త్ కార్డుతో పాటు ఇన్సూరెన్స్ అందించడం సంతోషకరమని ఆటో యూనియన్ అధ్యక్షులు బత్తుల కమలాకర్ వెల్లడించారు. ఈ సందర్భంగా బత్తుల కమ లాకర్ మాట్లాడుతూ....ఆటోలకు నెలకు రూ.12 వేల ఆర్థిక సహాయం హామీ ఇచ్చిన ప్రస్తుత ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి నయా పైసా ఇవ్వలేరని, ఆటోల వారు ఆర్థిక సమస్యలతో ఆత్మహత్యలకు పాల్పడ్డారని, కుటుంబీకులు బజారు పాలుఅవుతు న్నారని, ప్రభుత్వం పట్టించుకోవడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. మృతి చెందిన ఆ టోల కుటుంబాలకు ఇందిరమ్మ గృహం, ఎక్స్ గ్రేషియా అందించాలని డిమాండ్ చేశా రు. హెల్త్ కార్డులు అందించి, అండగా నిలిచినందుకు చల్మడ చారిటబుల్ ట్రస్ట్‌కు ఆటో యజమానులు, డ్రైవర్‌లు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు చిలుక పెంటయ్య, తిప్పని శ్రీనివాస్, ఆటోలు పాల్గొన్నారు.

Publisher, Editor and Owned by Manasani Krishna Reddy, H No 4-81/1, Ramagundam, Elkalpalli, Karimnagar, Telangana - 505208.
Cell No - 8074124190 . Editor : MANASANI KRISHNA REDDY

# జర్నలిస్టుల సమస్యలను పరిష్కరిస్తాం

**అర్హులైన వర్కింగ్ జర్నలిస్టులకు అక్రిడేషన్లు అందిస్తాం**

**ప్రజలకు అందిస్తున్న ప్రభుత్వ పథకాలను మీడియా ప్రచారం చేయాలి**

**సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి**

**అక్రిడేషన్లు జారీ చేసే బాధ్యత కలెక్టర్లది, డిపిఆర్ఓలది మాత్రమే**

**సమాచార శాఖ కమిషనర్ ముకుంద రెడ్డి**

**వాస్తవం : హైదరాబాద్**

రాష్ట్రవ్యాప్తంగా నెలకొని ఉన్న జర్నలిస్టుల సమస్యలను త్వరలోనే పరిష్కరిస్తామని రాష్ట్ర రెవెన్యూ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి స్పష్టం చేశారు. బుధవారం సెక్రటేరియట్‌లోని మంత్రి చాంబర్లో జర్నలిస్టు సంక్షేమ సంఘం రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో జర్నలిస్టుల సమస్యలపై కలిసి వారికి వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. రాష్ట్రంలో అర్హులైన వర్కింగ్ జర్నలిస్టులకు అక్రిడేషన్లు ఇవ్వాలని ప్రభుత్వపరంగా కలెక్టర్లకు, డిపిఆర్ ఓలకు ఆదేశాలు ఇవ్వడం జరిగిందని తెలిపారు. ప్రస్తుతం పలు ప్రింటింగ్, ఎలక్ట్రానిక్ మీడియాలలో వర్కింగ్ జర్నలిస్టుగా పనిచేస్తున్నటువంటి అర్హులైన జర్నలిస్టులకు అక్రిడేషన్లు ఇవ్వడమే కాకుండా ప్రభుత్వం ప్రకటించిన విధంగా వెటర్నర్స్, ఫ్రీ లాన్స్ జర్నలిస్టులకు నిబంధనల మేరకు అక్రిడేషన్లు జారీ చేయాలని గతంలోనే ప్రభుత్వం పేర్కొనడం జరిగింది. కానీ కొన్ని జిల్లాలలో కలెక్టర్లు, డిపిఆర్వోలు నిబంధనలను అమలు చేయకుండా అక్రిడేషన్లు జారీ చేయడం లేదని జర్నలిస్ట్ సంక్షేమ సంఘం రాష్ట్ర కమిటీ తమ దృష్టికి తీసుకు వచ్చిందని తెలిపారు. సత్వరమే అర్హులైన వర్కింగ్ జర్నలిస్టులకే కాకుండా వెటర్నర్స్, ఫ్రీ లాన్స్ జర్నలిస్టులకు నిబంధనల మేరకు అక్రిడేషన్లు జారీ చేయవలసిందిగా సమాచార శాఖ మంత్రి, కమిషనర్ కలెక్టర్లకు, డిపిఆర్ఓలకు ఆదేశాలు ఇస్తున్నామని జర్నలిస్టు సంక్షేమ సంఘానికి హామీ ఇచ్చారు. మంత్రి, కమిషనర్ల ఆదేశాల మేరకు అక్రిడేషన్లు జారీ చేయని యెడల రాష్ట్ర వ్యాప్తంగా అక్రిడేషన్ల సాధనకై ఉద్యమం చేపడతామని జెఎస్ఎస్ రాష్ట్ర కమిటీ ప్రభుత్వాన్ని హెచ్చరించింది. కార్యక్రమంలో జర్నలిస్టు సంక్షేమ సంఘం వ్యవస్థాపక అధ్యక్షులు చీకట్ల శ్రీనివాస్, జాతీయ అధ్యక్షులు మానసాని కృష్ణారెడ్డి, రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు తక్కెళ్ళపల్లి శ్రీనివాస్, డాక్టర్ కానుగంటి రాజు, గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షులు బాలేశం, వైస్ ప్రెసిడెంట్ రావుల విశ్వప్రసాద్, రాష్ట్ర కమిటీ సభ్యులు పాల్గొని వినతి పత్రాలను అందించారు.





## మారబోయిన రవి యాదవ్ ఆధ్వర్యంలో

# స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ సమీక్ష

**-సమావేశానికి విచ్చేసిన మాధవరం కృష్ణారావుకు ఘన స్వాగతం**

**-ఓటరు జాబితా సవరణ ప్రక్రియను విజయవంతం చేయాలని బీఆర్ఎస్ శ్రేణులకు పిలుపు**

**వాస్తవం : శేరిలింగంపల్లి, జూలై 15**




శేరిలింగంపల్లి నియోజకవర్గంలో స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (సర్) కార్యక్రమంపై సమీక్ష సమావేశం నిర్వహించనున్న సందర్భంగా శేరిలింగంపల్లి నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ ఇంచార్జ్, కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావుకు బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా గ్రేటర్ హైదరాబాద్ బీఆర్ఎస్ మాజీ యూత్ వైస్ ప్రెసిడెంట్, శేరిలింగంపల్లి ఉమ్మడి మూడు డివిజన్ ల ఇంచార్జ్ మారబోయిన రవి యాదవ్ మాట్లాడుతూ ..స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ కార్యక్రమాన్ని పార్టీ నాయకులు, కార్యకర్తలు అత్యంత బాధ్యతాయుతంగా తీసుకోవాలని సూచించారు. ప్రతి అర్హుడైన ఓటరు పేరు ఓటరు జాబితా లో ఉండేలా కృషి చేయాలని, ఎవరూ తమ ఓటు హక్కును కోల్పోకుండా అప్రమత్తంగా వ్యవహరించాలని పిలుపునిచ్చారు. శేరిలింగంపల్లి నియోజకవర్గంలో పార్టీ బలోపేతానికి, ప్రజల సమస్యల పరిష్కారానికి మాధవరం కృష్ణారావు నిరంతరం కృషి చేస్తున్నారని ఆయన కొనియాడారు. పార్టీ శ్రేణులు ఐక్యంగా పనిచేసి ప్రజలకు మరింత చేరువ కావాలని, ప్రతి బూత్ స్థాయిలో నాయకులు సమన్వయంతో పని చేసి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సూచించారు. ఈ సమావేశంలో మాజీ కార్పొరేటర్లు కొమిరిశెట్టి సాయిబాబా, మాధవరం రంగారావు, పార్ నంది శ్రీకాంత్, శ్రీకాంత్ యాదవ్, పొట్ట నరేందర్ యాదవ్, మల్లికార్జున శర్మ, రాజు, దొంతి చిన్న, వెంకటరెడ్డి, ఆర్ అనిత, నాగమణి, మహిళా నాయకురాలు,బీఆర్ఎస్ పార్టీ ప్రజాప్రతినిధులు, డివిజన్ ఇంచార్జులు, నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. సమావేశం విజయవంతం కావాలని ఆకాంక్షిస్తూ మాధవరం కృష్ణారావుకు మారబోయిన రవి యాదవ్ ప్రత్యేకంగా స్వాగతం తెలిపారు.



# పెద్దపల్లి జిల్లా కలెక్టర్‌తో ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ భేటీ



**వాస్తవం : గోదావరిఖని, జూలై 15:**

రామగుండం నియోజకవర్గ శాసనసభ్యులు ఎం.ఎస్. రాజ్ ఠాకూర్ బుధవారం పెద్దపల్లి జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష జిల్లా కలెక్టర్ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా రామగుండం నియోజకవర్గ అభివృద్ధికి సంబంధించిన పలు కీలక అంశాలపై చర్చించారు. ముఖ్యంగా పంచాయతీరాజ్, రోడ్లు భవనాలు), రోడ్డు కార్పొరేషన్ పరిధిలో పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులు, రహదారుల మెరుగుదల, మౌలిక వసతుల కల్పన తదితర అంశాలపై అధికారులతో సమీక్షిస్తూ త్వరితగతిన చర్యలు చేపట్టాలని కోరారు. ప్రజలకు మెరుగైన సౌకర్యాలు అందించడమే లక్ష్యంగా అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ అధికారులతో చర్చించారు.




## ఉద్యమ కళాకారులు,
# కవుల సమీక్షను విజయవంతం చేద్దాం

**ఉద్యమ కళాకారుల విభాగం**
**రాష్ట్ర కన్వీనర్ యెల్ల పోశెట్టి**

**వాస్తవం : వేములవాడ**

హైదరాబాద్ లోని సచివాలయం ఎదుట ఉన్న తెలంగాణ అమరవీరుల స్మరణ స్తూపం వద్ద  భవనంలో ఈనెల 28న నిర్వహించే ఉద్యమకారుల, కవుల సమీక్ష సమావేశాన్ని విజయవంతం చేయాలని ఉద్యమకారుల విభాగం రాష్ట్ర కన్వీనర్ కళా తపసి యెల్ల పోశెట్టి పిలుపునిచ్చారు.తెలంగాణ ఉద్యమ కళాకారుల ప్రధాన కార్యాలయం వేములవాడ లో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో యెల్ల పోశెట్టి మాట్లాడుతూ ఈ నెల 18న జరిగే కళాకారులు, కవులతో  కె కేశవరావు కమిటీ ముఖాముఖి సమీక్ష సమావేశానికి రాష్ట్రంలోని 33 జిల్లాల అధ్యక్ష, కార్యదర్శులు కవులు కళాకారులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఉద్యమ కళాకారుల ను కవులను గుర్తించడానికి ప్రభుత్వం కమిటిని ఏర్పాటు  చేసినందుకు తెలంగాణ ఉద్యమ కళాకారుల విభాగం రాష్ట్ర కమిటీ పక్షాన కృతజ్ఞతలు తెలి పారు. సమీక్ష సమావేశంలో వివిధ జిల్లాల



అధ్యక్షులు కార్యదర్శులు కవులు కళాకారులు అందరు ఈనెల 18 న ఉదయం 10 గంటల వరకు సమా వేశానికి చేరుకోవాలని పిలుపునిచ్చారు.



## మొక్కలు నాటేందుకు
# సిద్ధంగా ఉండాలి

**రాజన్న సిరిసిల్ల జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్**

**వాస్తవం : రాజన్న సిరిసిల్ల (ప్రతినిధి)**

వర్షాలు కురిసిన తరువాతే మొక్కలు నాటేందుకు సిద్ధంగా ఉండాలని రాజన్న సిరిసిల్ల జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. వన మహోత్సవంలో భాగంగా జిల్లాలో వివిధ శాఖల ఆద్వర్యంలో మొక్కలు నాటే లక్ష్యంపై జిల్లా అటవీ శాఖ అధికారి సత్యనారాయణ, పలు శాఖలతో జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలోని కాన్ఫరెన్స్ హాలులో జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ సమీక్ష సమావేశం బుధవారం నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ.... జిల్లాలోని వివిధ శాఖలకు కేటాయించిన లక్ష్యం మేరకు మొక్కలు నాటేందుకు సిద్ధంగా ఉంచాలని ఆదేశించారు. వివిధ పథకాల కింద గతంలో నాటిన మొక్కలు ఎండిపోయిన, పెరగకపోయిన వాటిని అట వీశాఖ అధికారులు పరిశీలించాలని సూచించారు. వర్షాలు కురిసిన తరువాతే ఏర్పాట్లు చేసి.. వన మహోత్సవంలో భాగంగా మొక్కలు నాటాలని పిలుపునిచ్చారు. వన మహోత్సవంలో భాగంగా ఆయా శాఖలకు కేటాయించిన  మొక్కల లక్ష్యం మొత్తం 8,65,200 గా లక్ష్యాన్ని నిర్ణయించామని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్  వెల్లడించారు.ఈ సమీక్ష సమావేశంలో డీఆర్ డీఓ లక్ష్మీనారాయణ, జిల్లా వ్యవసాయ అధికారి అఫ్జల్ బేగం. జిల్లా విద్యాధికారి మొండయ్య, జిల్లా వైద్యాధికారి ఏం జెలా ఆల్ఫ్రెడ్, జిల్లా పంచాయతీ అధికారి జయశీల, జిల్లా ఎక్సైజ్ అధికారి హిమశ్రీ, జిల్లా ఉద్యానవన శాఖ అధికారి శరత్ బాబు, మైనింగ్ శాఖ ఏడీ క్రాంతి, మున్సిపల్ కమిషనర్లు ఖదీర్ పాషా, లోకేష్ పాల్గొన్నారు.

# నేరాల నియంత్రణలో
# అధికారులు అప్రమత్తంగా వ్యవహరించాలి

**జిల్లా ఎస్పీ మహేష్ బి గితే**

**వాస్తవం : రాజన్న సిరిసిల్ల (ప్రతినిధి)**



నేరాల నియంత్రణలో పోలీసు అధికారులు నిత్యం అప్రమత్తంగా వ్యవహరిస్తూ సమర్థవంతమైన పోలీసింగ్‌ను పకడ్బందీగా అమలు చేయాలని రాజన్న సిరిసిల్ల జిల్లా ఎస్పీ మహేష్ బిగితే అధికారులను ఆదేశించారు.జిల్లా పోలీస్ కార్యాలయంలో వేములవాడ సబ్ డివిజన్ అధికారులతో బుధవారం నిర్వహించిన సమీక్ష సమావేశంలో శాంతి భద్రతలు, నేరాల నియంత్రణ, పోలీస్ స్టేషన్ల పనితీరు, పెండింగ్ కేసులు, దర్యాప్తు పురోగతి, ట్రాఫిక్ నియంత్రణ, సైబర్ నేరాల నివారణ, మాదక ద్రవ్యాల నిర్మూలన, పోలీసింగ్‌లో సాంకేతిక పరిజ్ఞానం వినియోగం తదితర అంశాలపై సమగ్రంగా సమీక్ష నిర్వహించి పలు కీలక సూచనలు చేశారు.ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మహేష్ బి గితే మాట్లాడుతూ.....ప్రతి కేసులో క్వా లిటీ ఆఫ్ ఇన్వెస్టిగేషన్ కి అత్యంత ప్రాధాన్యత ఇస్తూ, శాస్త్రీయ ఆధారాలతో పటిష్ఠమైన దర్యాప్తు చేపట్టి నేర స్తులకు శిక్ష పడేలా చర్యలు తీసుకో వాలని ఆదేశించారు. కేసుల దర్యాప్తులో నిర్లక్ష్యంగా వ్యవహరించే అధికారులపై క్రమశిక్షణ చర్యలు తప్పవని హె చ్చరించారు. సీసీటీఎన్ఎస్ 2.0, ఈ-సాక్ష్య, నాట్‌గ్రిడ్ వంటి సాంకేతిక వనరులను సమర్థంగా వినియోగించి కేసుల దర్యాప్తును వేగవంతం చేయాలని సూచించారు.దొంగతనం కేసులను అత్యంత ప్రాధాన్యంగా తీసుకుని సీసీటీవీ ఫుటేజీలు, ఇతర సాంకేతిక ఆధారాల సహాయంతో త్వరితగతిన ఛేదించి, దొంగిలించిన సొత్తును బాధితులకు అప్పగించేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు.సైబర్ నేరాలపై ప్రజలకు విస్తృత అవగాహన కల్పించడంతో పాటు మహిళలు,చిన్నారుల భద్రతకు ప్రత్యేక ప్రాధాన్యత ఇవ్వాలని,అలాగే మద్యం సేవించి వాహనాలు నడపడం, బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించడం, ర్యాష్ డ్రైవింగ్ వంటి ఉల్లంఘనలపై ప్రత్యేక డ్రైవ్‌లు నిర్వహించి కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.ఈ సమావేశంలో  డీఎస్పీలు శ్రీనివాసులు, వెంకటేశ్వర్లు, సీఐలు వీరప్రసాద్, శ్రీనివాస్, రవీందర్, మొగిలి, మధుకర్, ఆర్ఐలు మధుకర్, సురేష్, ఎస్ఐలు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.






# త్వరలోనే కుల సంఘాల భవన నిర్మాణ పనులు ప్రారంభం

**స్థలాన్ని పరిశీలించిన**
**రాష్ట్ర ప్రభుత్వ విప్**

**వాస్తవం : వేములవాడ**

వేములవాడ పట్టణ అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో మంజూరైన బీసీ భవన్,అంబేద్కర్ భవన్, క్రిస్టియన్ భవన్, ఎస్టీ భవన్,నిర్మాణ పనులు త్వరలోనే ప్రారంభం కానున్నాయని రాష్ట్ర ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ తెలిపారు. వేములవాడ పట్టణంలో ఆయా భవనాల నిర్మాణానికి స్థలాలను ఆది శ్రీనివాస్ అధికారులతో కలిసి బుధవారం పరిశీలించారు.నాలుగు భవనాలకు ఒక్కో భవనానికి 1 కోటి 30 లక్షలు మంజూరు కేటాయించగ టెండర్లు కూడా పూర్తి కావడం జరిగింది.భవన నిర్మాణాలకు స్థలాన్ని కేటాయించడానికి అవసరమైన ప్రక్రియలను త్వరితగతిన పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు ఆది శ్రీనివాస్ సూచించారు సమాజంలోని అన్ని వర్గాలకు ఉపయోగపడేలా నాణ్యమైన సౌకర్యాలతో ఈ భవనాలను నిర్మించనున్నట్లు తెలిపారు.అనంతరం ఫుట్ ఓవర్ బ్రిడ్జి ,తిప్పాపూర్‌లో నిర్మాణంలో ఉన్న మూడో బ్రిడ్జి పనులను విప్ పరిశీలించారు. ప్రస్తుతం పనులు తుది దశకు చేరుకున్నాయని, త్వరలోనే ప్రజలకు అందుబాటులోకి తీసుకువచ్చేందుకు చర్యలు చేపడుతున్నామని పేర్కొ న్నారు. బ్రిడ్జి అందుబాటులోకి వస్తే పట్టణంలో ట్రాఫిక్ రద్దీ తగ్గడంతో పాటు ప్రజల రాకపోకలు మరింత సులభతరం అవుతాయని చెప్పారు.అదేవిధంగా తిప్పాపూర్ రైతులు తమ



వ్యవసాయ క్షేత్రాలకు సులభంగా చేరుకునేందుకు సర్వీస్ రోడ్డు ఎంతో ఉపయోగంగా ఉంటుందని తెలిపారు.వేములవాడ పట్టణ అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో వేములవాడ మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు పాల్గొన్నారు.

# గ్యాస్ సిలిండర్ పేలి ఐదుగురికి తీవ్ర గాయాలు

### గాయపడిన వారిలో ఇద్దరి పరిస్థితి విషమం

### ఎస్ఐ సుభాష్ గౌడ్

**వాస్తవం : మనోహరాబాద్**

మనోహరాబాద్ మండలంలోని పరికిబండ గ్రామ శివారులో మంగళవారం రాత్రి గ్యాస్ లీకేజీ కారణంగా పేలుడు సంభవించి అగ్నిప్రమాదం జరిగింది.ఈ ప్రమాదంలో బీహార్ రాష్ట్రానికి చెందిన ఐదుగురు వ్యక్తులకు తీవ్ర గాయాలయ్యాయి, ఇందులో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉంది.విషయం తెలుసుకున్న డీఎస్పీ నరేందర్ గౌడ్,ఎస్ఐ సుభాష్ గౌడ్,పోలీసులు సిబ్బందితో ఘటన స్థలాని సందర్శించి పరిశీలించారు. గాయపడిన వారిని చికిత్స నిమిత్తం తూప్రాన్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి.అనంతరం మెరుగైన చికిత్స కొరకు సుచిత్ర లోని రష్ హాస్పిటల్ కి తరలించారు.పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఖమ్మం జిల్లాకు చెందిన జగదీష్ అనే వ్యక్తి అద్దెకు తీసుకున్న గదిలో గృహ వినియోగ గ్యాస్ సిలిండర్ ల నుంచి



ఇతర సిలిండర్ లకు అక్రమంగా గ్యాస్ రీఫిలింగ్ నిర్వహిస్తున్నట్లు గుర్తించారు.ఘటన జరిగిన సమయంలో అక్కడ పని చేస్తున్న కార్మికులు అంతా కలిసి వంట చేసుకుంటుండగాగ్యాస్ లీక్ కావడంతో ఒక్కసారిగా మంటలు చెలరేగి ప్రమాదం జరిగినట్లు తెలిపారు.పోలీసుల విచారణలో గాయపడినవారంతా జగదీష్ వద్ద గ్యాస్ రి ఫీలింగ్ పనుల కోసం వచ్చిన కార్మికులని తెలిసింది.బలరామ్ మహతో ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని గృహ వినియోగ గ్యాస్ సిలిండర్లను అక్రమంగా రిఫ్లింగ్ చేస్తున్న జగదీష్ పై సంబంధిత చట్టాల ప్రకారం కఠినచర్యలు తీసుకుంటామని ఎస్ఐ సుభాష్గౌడ్ తెలిపారు.

# వేములవాడ-కోరుట్ల ప్రధాన రహదారి ప్రమాదకర స్థలాల పరిశీలన

**వాస్తవం : వేములవాడ (ఆర్ సి ఇంఛార్జి)**

రాజన్న సిరిసిల్ల జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్' ఆదేశాల మేరకు జిల్లా రోడ్డు భద్రత కమిటీ సభ్యులు డిటిఓ డి శ్రీనివాస్, ఆర్ అండ్ బి డిప్యూటీ ఇంజనీర్ శాంతయ్య, ఆర్టీఏ మెంబర్ సంగీతం శ్రీనాథ్ , వేములవాడ, రుద్రంగి, చందుర్తి పోలీసు అధికారులు సంయుక్తంగా కోరుట్ల--వేములవాడ ప్రధాన రహదారిపై ఉన్న ప్రమాదకర ప్రాంతాలను బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయా ప్రాంతాల్లో రోడ్డు ప్రమాదాల నివారణకు చేపట్టాల్సిన చర్యలను గుర్తించి సంబంధిత అధికారులకు సూచనలు జారీ చేశారు.రుద్రంగి చెక్పోస్ట్ సమీపంలో ఉన్న సెమీ సర్కిల్ మలుపును పరిశీలించి, వాహనాల వేగ నియంత్రణ కోసం రోడ్డు హెచ్చరిక బోర్డులు, రంబుల్ స్ట్రిప్స్, రంబుల్ ప్యాడ్స్, రోడ్ స్టడ్స్ ఏర్పాటు చేయాలని సూచించారు. నందివాగు సమీపంలోని చిన్న కల్వర్టు వద్ద పరిశీలన నిర్వహించి, వాహనదారుల భద్రత కోసం అవసరమైన క్రాష్ బ్యారియర్లు ఏర్పాటు చేయాలని నిర్ణయించారు.రుద్రంగి ఇంద్రమ్మ చౌక్ వద్ద, కోరుట్ల వైపు వెళ్లే రహదారిలో వాహనాలు అధిక వేగంతో ప్రయాణిస్తున్న నేపథ్యంలో, వేగ నియంత్రణ కోసం రంబుల్ స్ట్రిప్స్ ఏర్పాటు చేయాలని సూచించారు.మీపూరిపల్లె సమీపంలో తరచుగా ప్రమాదాలు జరుగుతున్న ప్రాంతాన్ని పరిశీలించి, రోడ్ స్టడ్స్, రంబుల్



ప్యాడ్స్ ఏర్పాటు చేసి ప్రమాదాలను నివారించే చర్యలు చేపట్టాలని ఆదేశించారు.మల్యాల సమీపంలోని లో-లెవెల్ క్రాస్ వే వద్ద అవసరమైన సైడ్ క్రాష్ బ్యారియర్లు ఏర్పాటు చేయాలని సూచించారు.చందుర్తి మండలంలోని ఇంద్రమ్మ చౌరస్తా వద్ద ఉన్న ప్రమాదకర మలుపును పరిశీలించి, రంబుల్ స్ట్రిప్స్, రోడ్ స్టడ్స్, హెచ్చరిక సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని నిర్ణయించారు.మరిగడ్డ సర్కిల్ వద్ద, మరిగడ్డ--సనుగుల రహదారి,కోరుట్ల--వేమలవాడ జంక్షన్ను ప్రమాదకర ప్రాంతంగా గుర్తించి, అక్కడ రోడ్డు హెచ్చరిక బోర్డులు, రంబుల్ స్ట్రిప్స్, రోడ్ స్టడ్స్ ఏర్పాటు చేయాలని సూచించారు.ఈ సందర్భంగా రోడ్డు భద్రతకు సంబంధించిన అన్ని మౌలిక సదుపాయాలను త్వరితగతిన ఏర్పాటు చేసి ప్రమాదాలను తగ్గించేందుకు సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు అధికారులకు సూచనలు జారీ చేశారు.

# యాదవ సమాజాన్ని కించపరిచే వాఖ్యలు చేస్తే సహించేది లేదు

### మండల యాదవ సంఘం నేతలు

**వాస్తవం : తంగళ్ళపల్లి**

ఈశ్వరమ్మపై యూత్ కాంగ్రెస్ స్టేట్ ప్రెసిడెంట్ శివ చరణ్ రెడ్డి అనుచిత వాఖ్యలు చేశాడంటూ మండిపడ్డ యాదవ సంఘ నాయకులు.యాదవ సమాజం ఆగ్రహం..జక్కిడి శివచరణ్ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.తంగళ్లపల్లి మండల కేంద్రంలో మండల యాదవ సంఘం అధ్యక్షుడు బండి దేవేందర్ యాదవ్ ఆధ్వర్యంలో ప్లకార్డులు పట్టుకొని నిరసన తెలిపిన యాదవ సంఘం లీడర్లు.జక్కిడి శివ చరణ్ రెడ్డి డిస్టిబొమ్మ దహనానికి యాదవ సంఘం నేతల యత్నం అడ్డుకున్న పోలీసులు.యాదవ సమాజానికి చెందిన ఈశ్వరమ్మపై అనుచిత వ్యాఖ్యలు చేయడాన్ని తీవ్రంగా ఖండించిన నాయకులు.ఈ వ్యాఖ్యలు యాదవుల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసేలా ఉన్నాయని ఆవేదన చెందారు.యాదవ సమాజాన్ని కించపరిచే వ్యాఖ్యలను ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోమని హెచ్చరించారు.జక్కిడి శివచరణ్ వెంటనే బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. క్షమాపణ చెప్పకపోతే రాష్ట్రవ్యాప్తంగా యాదవ సంఘాలతో కలిసి ఆందోళనలను ఉధృతం చేస్తామని స్పష్టం చేశారు.యాదవ సమాజం గౌరవాన్ని దెబ్బతీసే చర్యలను తీవ్రంగా వ్యతిరేకిస్తామని వెల్లడించారు.బాధ్యులపై చట్టప



రమైన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సామాజిక వర్గాల మనోభావాలను దెబ్బతీసే వ్యాఖ్యలు చేయకుండా అందరూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించిన నాయకులు.ఈ కార్యక్రమంలో జిల్లా యాదవ సంక్షేమ సంఘం యూత్ అధ్యక్షులు మోతె మహేష్ యాదవ్, యాదవ సంఘం రాష్ట్ర నాయకులు జక్కుల నాగరాజు,సహాయ కార్యదర్శి చెన్నవేణి తిరుపతి,ప్రచార కార్యదర్శులు లచ్చయ్య,కొమురయ్య,శ్రీధర్,గంగాధర్,శ్రీశైలం,రంగయ్య,మహేష్ రంజిత్,

### అంగన్వాడి చిన్నారులతో భోజనం చేసిన

# డివిజన్ కార్పొరేటర్ నేలకంటి రాము



**వాస్తవం : గోదావరిఖని**

ఎమ్మెల్యే శ్రీ రాజ్ ఠాగూర్ మక్కాన్సింగ్ ఆదేశాల మేరకు 38వ డివిజన్ కార్పొరేటర్ నేలకంటి రాము డివిజన్ పరిధి లోని అంబేద్కర్ నగర్లోని అంగన్వాడీ కేంద్రాన్ని సందర్శించారు ఈ సందర్భంగా చిన్నారులకు అందిస్తున్న ఆహారం నాణ్యతను స్వయంగా పరిశీలించి వారికి వడ్డిస్తున్న స్వయంగా భోజనం చేసి నాణ్యతను నిర్ధారించారు.అనంతరం చిన్నారులకు పోషకాహారం నాణ్యంగా పరిశుభ్రంగా అందేలా నిరంతరం ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సంబంధిత సిబ్బందికి సూచించారు.ఈ కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్లు సహాయకురాలు డివిజన్ అధ్యక్షులు పంజాల ఆంజనేయులు, కోట రాజ్ కుమార్ దుర్గారాజ్ రాంకీ వెంకటేష్ పాల్గొన్నారు.

### గజ్వేల్ ఇంచార్జ్ నర్సారెడ్డిని

# పార్టీ నుండి సస్పెండ్ చేయాలి

### స్థానిక కాంగ్రెస్ నాయకులు పిసిసి అధ్యక్షుడికి ఫిర్యాదు



**వాస్తవం : మనోహరాబాద్**

గజ్వేల్ నియోజకవర్గ ఇన్చార్జి తూముకుంట నర్సారెడ్డి తన సొంత లాభాల కోసం నామినేటెడ్ పదవులు అమ్ముకుంటూ, కాంగ్రెస్ పార్టీకి ద్రోహం చేస్తున్నారని కాంగ్రెస్ సీనియర్ నాయకులు మహిపాల్ రెడ్డి ఆధ్వర్యంలో స్థానిక కాంగ్రెస్ నాయకులంతా కలిసి బుధవారం పిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్కు ఫిర్యాదు చేశారు.నియోజకవర్గంలో ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తూ తూప్రాన్,మనోహరాబాద్ మండలాలలో కాంగ్రెస్ పార్టీ నాయకుల మధ్య చిచ్చు పెడుతున్నారని మండిపడ్డారు.అతనిపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో పేర్కొన్నారు.డబ్బుల కోసం కాంగ్రెస్ పార్టీ పరువు తీస్తున్నాడని ఆవేదన వ్యక్తం చేశారు.కాంగ్రెస్ పార్టీ నుండి తక్షణమే నర్సారెడ్డిని సస్పెండ్ చేయాలని కాంగ్రెస్ నాయకులంతా డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో తూప్రాన్,మనోహరాబాద్ మండలాల కాంగ్రెస్ సీనియర్ నాయకులు,పాల్గొన్నారు.

### బీజెపి రాష్ట్ర అధ్యక్షులు రామచంద్రరావును

# కలిసిన నాయకులు

### జిల్లా ప్రధాన కార్యదర్శి నత్తి మల్లేష్ ముదిరాజ్

**వాస్తవం : మనోహరాబాద్**



సిద్దిపేట జిల్లా నూతన కమిటలో జిల్లా బిజెపి ప్రధాన కార్యదర్శిగా ఎన్నికైన నత్తి మల్లేష్ ముదిరాజ్,జిల్లా సోషల్ మీడియా కన్వీనర్గా ఎన్నికైన మాస్కులా శశిధర్ రెడ్డి,బుధవారం భారతీయ జనతా పార్టీ రాష్ట్ర అధ్యక్షులు ఎన్ రామచంద్రరావును వారి క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన సిద్దిపేట జిల్లా బిజెపి సభ్యుల కు రాష్ట్ర అధ్యక్షులు రామచంద్రరావు శుభాకాంక్షలు తెలిపారు.అనంతరం వారు మాట్లాడుతూ భారతీయ జనతాపార్టీ అభివృద్ధి కొరకు అహర్నిశలు కష్టపడాలని,జరగబోయే మున్సిపల్,జెడ్పీటీసీ,ఎంపీటీసీ ఎలక్షన్స్లో అత్యధిక స్థానాలు బీజేపీ అభ్యర్థులను గెలిపించి జెడ్పీ ఛైర్మన్, ఎంపీపీ,మున్సిపల్ చైర్మన్ స్థానాలను కైవసం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో నాయకులు కప్పర ప్రసాద్,పిట్ల పోచయ్య,చందా అశోక్,కుంట రాజు పాల్గొన్నారు.

జన్మదినోత్సవాలు,
పదవీ విరమణ
శుభాకాంక్షల
ప్రకటనల కోసం సంప్రదించండి
8074124190


# జూలై 18న ఛలో యువ సంగ్రామ సదస్సు

**పటాన్ చెరు నియోజకవర్గం నుండి 5 వేల మంది హాజరు**

**మోసాలకు చిరునామా కాంగ్రెస్**

**నిరుద్యోగ డిక్లరేషన్ అమలులో ఘోర వైఫల్యం**

**నిరుద్యోగులు నమ్మించి గొంతు కోసిన కాంగ్రెస్ ప్రభుత్వం**

**ఎస్ ఐ ఆర్ అంశంలో అప్రమత్తంగా ఉండండి**

**పటాన్ చెరు శాసన సభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి**



**వాస్తవం : పటాన్ చెరు**

ఎన్నికల ముందు యువజన ప్రకటనలో నిరుద్యోగ డిక్లరేషన్ నిరుద్యోగ యువతకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని కాంగ్రెస్ ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చేందుకు బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ఈ నెల 18న హైదరాబాదులో నిర్వహించ తలపెట్టిన యువ సంగ్రామ సదస్సుకు పటాన్చెరు నియోజకవర్గం నుండి 5 వేల మంది యువత హాజరుకానునట్లు పటాన్ చెరు శాసన సభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి స్పష్టం చేశారు. బుధవారం ఉదయం పటాన్ చెరు డివిజన్ పరిధిలోని జిఎంఆర్ కన్వెన్షన్ సెంటర్లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సదస్సు వివరాలను ఆయన వెల్లడించారు.గత అసెంబ్లీ ఎన్నికల సమయంలో సరూర్ నగర్ స్టేడియం వేదికగా కాంగ్రెస్ పార్టీ జాతీయ నాయకురాలు ప్రియాంక గాంధీ తమ ప్రభుత్వం అధికారంలోకి వస్తే నిరుద్యోగులకు పెద్ద ఎత్తున ఉద్యోగాలు కల్పిస్తామంటూ నిరుద్యోగ డిక్లరేషన్ ప్రకటించిందని అన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి రెండున్నర సంవత్సరాలు గడుస్తున్న, నేటికి యువజన సంక్షేమంపై ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవడంలో ఘోరంగా విఫలమైందని అన్నారు. ఉపాధి కల్పిస్తామని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చి, ఉద్యోగ ప్రకటనలు జారీ చేయడంలో కాంగ్రెస్ విఫలమైందని ఆయన ఆరోపించారు. నిరుద్యోగ యువతను, రైతులను, మహిళలను కాంగ్రెస్ మోసం చేసిందని పేర్కొంటూ, ఈ యువజన సమావేశం ప్రభుత్వంపై ఒత్తిడిని పెంచుతుందని ఆయన అన్నారు. ఫీజు రీయింబర్స్మెంట్, నియామకాలలో జాప్యం చేయడం ద్వారా ప్రభుత్వం విద్యార్థులను, నిరుద్యోగ యువతను నమ్మించి గొంతు కోసిందని విమర్శించారు. పటాన్ చెరు నియోజకవర్గంలోని మున్సిపాలిటీలు,డివిజన్లు, గ్రామాల నుండి ఐదు వేల మంది యువత సదస్సుకుహాజరు కాబోతుందని తెలిపారు. ఇందుకు సంబంధించి అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. సర్ పై అప్రమత్తంగా ఉండండి. ప్రజలకు మరింతగా అవగాహన కల్పించండి. కేంద్ర ఎన్నికల సంఘం చేపట్టిన స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ అంశంలో ప్రజలకు మరింత అవగాహన కల్పించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపైన ఉందన్నారు. ఇప్పటి వరకు దరఖాస్తులు నింపని అర్హులైన ప్రతి ఓటర్ని కలిసి దరఖాస్తులు నింపేలా చైతన్యం తీసుకుని రావాలని కోరారు. ఎస్ఐఆర్ అంశంలో పటాన్ చెరు నియోజకవర్గాన్ని రాష్ట్రంలోనే మొదటి స్థానంలో నిలపాలని విజ్ఞప్తి చేశారు. పటాన్చెరు అభివృద్ధికి ఓటు హక్కు అత్యంత కీలకమని తెలిపారు. ఈ సమావేశంలో ప్రజా ప్రతినిధులు, మాజీ ప్రజా ప్రతినిధులు, బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు, అనుబంధ సంఘాల ప్రతినిధులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

### రెండు ద్విచక్రవాహనలు ఢీకొని

# ఒకరి పరిస్థితి విషమం



**వాస్తవం : రుద్రంగి**

రుద్రంగి మండలకేంద్రంలోని మానాల గ్రామానికి వెళ్లే దారిలో ఉన్న రైస్ మిల్లు వద్ద బుధవారం రెండు ద్విచక్రవాహనలు ఎదురెదురుగా వచ్చి ఢీ కొనగా ఒకరి తలకు బలమైన గాయాల పాలయ్యాడు.పరిస్థితి విషమంగా ఉండటంతో స్థానికులు 108 కి సమాచారం అందించి ఆసుపత్రికి తరలించారు.అందిన సమాచారం మేరకు పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని పూర్తి వివరాలు సేకరిస్తున్నారు.

### పంట పొలంలో

## రైతు అనుమానాస్పద స్థితిలో మృతి

**వాస్తవం : రుద్రంగి**



రుద్రంగి మండలకేంద్రనికి చెందిన బోయిని భిక్కయ్య అనే రైతు బుధవారం పొలం పనుల నిమిత్తం వెళ్లి మృతి చెందా డు. అందిన సమాచారం మేరకుపోలీసులు సంఘటన స్థలాని కి చేరుకొని వివరాలు సేకరిస్తున్నారు.మృతదేహానికి పంచనా మా అనంతరం పోస్టుమార్టం నిమిత్తం ఏరియా ఆసుపత్రికి తరలించారు.

# ఆధునిక విద్యాభోధనలను టీచర్లు అలవర్చుకోవాలి

**జగిత్యాల ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్**

**జగిత్యాల జులై 15(వాస్తవం )**



ఉపాధ్యాయులు ఆధునిక సమాజానికి అనుగుణంగా తమను తాము నవీకరించుకోని విద్యార్థులకు భోధనలు చేయాలని జగిత్యాల ఎమ్మెల్యే డా.సంజయ్ కుమార్ అన్నారు.బుధవారం స్థానిక ఓల్డ్ హైస్కూల్లో గత మూడు రోజులుగా ఫిజికల్ సైన్స్ ఉపాధ్యాయులకు నిర్వహిస్తున్న ఇంటిగ్రేటెడ్ టీచర్స్ ట్రైనింగ్ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరై ఎమ్మెల్యే మాట్లాడారు. ఉపాధ్యాయులు కృత్రిమ మేధను ఉపయోగించేలా ఈ శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నారని ప్రతి వారు వారి వృత్తిలో వారి నైపుణ్యాలను మెరుగుపరుచుకుంటారని,ఉపాధ్యాయులు కూడా మెరుగుపరుచుకుంటేనే బోధన సులువుతుందని వారన్నారు,దానికి వారి వైద్య వృత్తిని ఉదాహరణగా చెప్పారు తమను తాము నిరంతరం నైపుణ్యాలను పెంచుకుంటేనే వైద్య రంగంలో రాణిస్తామని అలాగే ఉపాధ్యాయులు కూడా నిరంతరం ఈ శిక్షణ కార్యక్రమాల ద్వారా బోధన మెలకువలను మెరుపరచుకోవాలని పిలుపునిచ్చారు ప్రభుత్వ పాఠశాలల్లో ఉన్న బడుగు బలహీన వర్గాల పిల్లలకు మంచి విద్యను అందించి వారి అభివృద్ధికి తోడ్పడాలని కోరారు.ఓటమికి నిరాశపడకుండా ఉండేలా విద్యార్థులలో ఉపాధ్యాయులు ఆత్మ స్థైర్యాన్ని నింపాలని,తాను పదవ తరగతిలో ఫెయిల్ అయినా కూడా తర్వాత పెద్ద డాక్టర్ ను కాగలిగానని తెలిపారు గత ఎస్ఎస్సి ఫలితాలు జిల్లా నాలుగవ స్థానం రావడం మరియు ప్రైవేటు పాఠశాలల నుండి విద్యార్థులు ఎక్కువ సంఖ్యలో మన జిల్లాలో ప్రభుత్వ పాఠశాలలో చేరుతున్నందుకు ఉపాధ్యాయులను అభినందించారు. అనంతరం విద్యార్థులతో ముచ్చటించారు పాఠశాలలోనే భోజనం చేశారు.ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాధికారి రాము,మండల విద్యాధికారి చంద్రకళ, అకాడమిక్ మానిటరింగ్ అధికారి చంద్రశేఖర్ రెడ్డి, జిల్లా సైన్స్ అధికారి మచ్చ రాజశేఖర్ పి ఆర్ టి యు టి ఎస్ జిల్లా అధ్యక్షులు బోయిని పెల్లి ఆనంద్ రావు, రిసోర్సెస్ పర్సన్స్ పరమేశ్వర్, జగదీశ్వర్, రాజకుమార్, లక్ష్మణ్ తదితరులున్నారు.

### వర్కింగ్ ఉమెన్స్ హాస్టల్ పనులను

### పరిశీలించిన జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే



**వాస్తవం : జూబ్లీహిల్స్**

కార్మిక నగర్( జూబ్లీహిల్స్ నియోజకవర్గం)డివిజన్లోని ఎస్ పి ఆర్ హిల్స్ గ్రౌండ్లో నిర్మాణంలో ఉన్న వర్కింగ్ ఉమెన్స్ హాస్టల్ పనులను జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే వి. నవీన్ యాదవ్ బుధవారం పరిశీలించారు.అనంతరం కార్మిక నగర్ ప్రాంతంలోని వినాయక్నగర్ గల్లీలో పర్యటించిన ఎమ్మెల్యే స్థానిక ప్రజలను కలిసి డ్రైనేజీ సమస్యలపై వారి నుంచి వివరాలు తెలుసుకున్నారు.ఈ కార్యక్రమంలో స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

# దుర్గం చెరువులోకి మురుగునీటి ప్రవాహానికి అడ్డుకట్ట

**తక్షణ చర్యలకు సీఎంసీ కమిషనర్ ఆదేశాలు**

**సోమవారం నాటికి ఎస్టీపీకి మళ్లింపు పూర్తి చేయాలి**

**పనులను స్వయంగా సమీక్షిస్తానన్న కమిషనర్**

**వాస్తవం : శేరిలింగంపల్లి : జూలై 15**

దుర్గం చెరువులోకి మురుగునీరు చేరకుండా తక్షణ చర్యలు చేపట్టాలని సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (సీఎంసీ)కమిషనర్ సంబంధిత అధికారులను ఆదేశించారు.సీఎంసీ, హైదరాబాద్ మెట్రో వాటర్ సప్లై అండ్ సీవరేజ్ బోర్డు ఉన్నతాధికారులతో కలిసి దుర్గం చెరువు ఎస్టీపీతో పాటు ఇంటర్సెప్షన్ అండ్ డైవర్షన్ (ఐ అండ్ డి) వ్యవస్థను ఆయన పరిశీలించారు.ప్రస్తుతం అమలులో ఉన్న మురుగునీటి మళ్లింపు ఏర్పాట్లను సమీక్షించిన కమిషనర్,చెరువులోకి మురుగునీటిని తీసుకువస్తున్న వెంట్లను రేపటిలోగా మూసివేయాలని, సోమవారం నాటికి మురుగునీటి ప్రవాహాన్ని పూర్తిగా ఎస్టీపీకి మళ్లించాలని ఆదేశించారు.అలాగే ఐ అండ్ డి నిర్మాణం వద్ద సోమవారం నాటికి ఏరేటర్లను ఏర్పాటు చేయాలని రహేజా సంస్థకు సూచించారు. ఎస్ఎన్డీపీ బాక్స్ డ్రెయిన్ పనుల కారణంగా ప్రభావితమైన సీవర్ లైన్ను వెంటనే పునరుద్ధరించాలని, భవిష్యత్తులో మురుగునీరు చెరువులోకి చేరకుండా శాశ్వత మళ్లింపు పైప్లైన్ల ఏర్పాటుకు చర్యలు చేపట్టాలని అధికారులకుసూచించారు.టీ-హబ్, టీజీఐఐసీ లేఅవుట్ ప్రాంతం నుంచి వస్తున్న మురుగునీటి ప్రవాహాన్ని కూడా పరిశీలించి అవసరమైన చర్యలు తీసుకోవాలని హెచ్ఎండబ్ల్యూఎస్ఎస్బీ అధికారులను ఆదేశించారు.ఆదేశాల అమలుపై ప్రత్యేక దృష్టి సారించిన కమిషనర్,సోమవారం మరోసారి దుర్గం చెరువును సందర్శించి పనుల పురోగతి,తీసుకున్న చర్యలను స్వయంగా సమీక్షిస్తానని తెలిపారు.



# సంతకాలు దాటిన సమరం

# హర్మూజ్ సెగతో మళ్ళీ రగులుతున్న మధ్యప్రాచ్యం



డా. సూర్యదేవర రామకృష్ణ
9490754169

ఫిబ్రవరి 2026 లో మొదలైన అమెరికా–ఇజ్రాయెల్–ఇరాన్ యుద్ధం అనేక మలుపులు తిరిగింది. ఏప్రిల్‌లో కాల్పుల విరమణ, జూన్‌లో చారిత్రాత్మక అవగాహన ఒప్పందం జరిగినప్పటికీ, జులై నాటికి పరిస్థితి మళ్ళీ మొదటికొచ్చింది. రెండు దేశాలు పరస్పరం దాడులు చేసుకోవడంతో శాంతి ప్రక్రియ ప్రశ్నార్థకంగా మారింది. ఇంతకీ ఈ అంతర్జాతీయ శాంతి ఎందుకు నిలబడలేకపోతోంది? దీని వెనుక ఉన్న అసలు లక్ష్యాలు, సమీకరణాలు ఏమిటో లోతుగా పరిశీలించాల్సి ఉంది.

**యుద్ధం మళ్ళీ ఎందుకు రాజుకుంది?**

ఈ ఏడాది ఫిబ్రవరి 28న అమెరికా, ఇజ్రాయెల్‌లు ఇరాన్‌పై భారీ వైమానిక దాడులకు దిగాయి. ఈ దాడుల్లో ఇరాన్ సర్వోన్నత నేత అలీ ఖమేనీ మరణించడంతో ఉద్రిక్తతలు పరాకాష్టకు చేరాయి. దీనికి ప్రతిచర్యగా ఇరాన్ రంగంలోకి దిగి, అమెరికా సైనిక స్థావరాలపై, ఇజ్రాయెల్‌పై క్షిపణి దాడులు చేసింది. అంతే కాకుండా, ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు గుండెకాయ వంటి హర్మూజ్ జలసంధిని మూసివేసింది. లెబనాన్ నుండి హెజ్బొల్లా కూడా ఇజ్రాయెల్‌పై దాడులు ప్రారంభించడంతో యుద్ధం విస్తరించింది.పరిస్థితి చేయిదాటడంతో పాకిస్తాన్ మధ్యవర్తిత్వం వహించింది. ఏప్రిల్ 8న రెండు వారాల కాల్పుల విరమణ కుదిరినప్పటికీ, క్షేత్ర స్థాయిలో ఉల్లంఘనలు నిరంతరం సాగాయి. ఎట్టకేలకు జూన్ 17న డొనాల్డ్ ట్రంప్, ఇరాన్ అధ్యక్షుడు మసూద్ పెజెష్కియాన్ 14 అంశాల అవగాహన ఒప్పందంపై సంతకాలు చేశారు. అన్ని రంగాల్లో సైనిక చర్యలను శాశ్వతంగా నిలిపివేయడం, హర్మూజ్ జలసంధిని వాణిజ్య నౌకలకు తెరవడం, తుది శాంతి ఒప్పందం కోసం 60 రోజుల పాటు చర్చలు జరపడం ఇందులో ముఖ్యమైన అంశాలు.అయితే, ఈ శాంతి ఎక్కువ కాలం నిలవలేదు. జులై 8న ట్రంప్ ఈ కాల్పుల విరమణ ముగిసిందని అధికారికంగా ప్రకటించారు. హర్మూజ్ జలసంధిలో వాణిజ్య నౌకలపై ఇరాన్ దాడులు చేస్తోందని అమెరికా ఆరోపించడమే దీనికి కారణం. వెనువెంటనే అమెరికా ఇరాన్ భూభాగంలోని 90కి పైగా వ్యూహాత్మక లక్ష్యాలపై దాడులు చేసింది. బుషెహర్ అణు విద్యుత్ కేంద్రం సమీపంలో కూడా పేలుళ్లు సంభవించాయి. దీనికి ప్రతికారంగా ఇరాన్ జోర్డాన్‌తో పాటు గల్ఫ్ దేశాలైన బహ్రెయిన్, కువైట్‌లపై ప్రతిదాడులు చేయడంతో యుద్ధ మేఘాలు మళ్ళీ కమ్ముకున్నాయి.

**వివాదానికి కేంద్ర బిందువు : హర్మూజ్ జలసంధి**

ప్రపంచ చమురు, గ్యాస్ సరఫరాలో ఐదో వంతు వాటా ఉన్న హర్మూజ్ జలసంధి ఈ వివాదానికి అసలు కేంద్ర బిందువు. యుద్ధానికి ముందు ఈ మార్గం గుండా రోజుకు సగటున 130 వాణిజ్య నౌకలు ప్రయాణించేవి. జూన్ నాటి "ఎంఓయూ " ఒప్పందంలో 60 రోజుల పాటు ఎటు వంటి రుసుము లేకుండా నౌకలకు సురక్షిత మార్గం కల్పించేందుకు ఇరాన్ శాయశక్తులా ప్రయత్నిస్తుంది అనే అస్పష్టమైన నిబంధనను చేర్చారు. భవిష్యత్తులో సర్వీస్ ఫీజు విధించే అవకాశాన్ని ఈ వాక్యం కొట్టిపారేయలేదు. దీన్ని ఆసరాగా చేసుకుని జలసంధిపై తన సార్వభౌమత్వాన్ని నిరూపించుకోవాలని ఇరాన్ చూస్తోంది. ఇరాన్ పార్లమెంట్ స్పీకర్ మహమ్మద్ ఘలిబాఫ్ మాట్లాడుతూ, హర్మూజ్ జల సంధి ఇరాన్ నిబంధనల ప్రకారమే నడుస్తుంది తప్ప, అమెరికా బెదిరింపులకు లొంగదు అని తేల్చి చెప్పారు. దీనికి భిన్నంగా అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ హెచ్చరిస్తూ, ఈ అంతర్జాతీయ జలమార్గం ఎల్లప్పుడూ తెరిచే ఉండాలని, దీన్ని మూసివేయాలని చూస్తే అమెరికా సైన్యం ఊరుకోదని స్పష్టం చేశారు.జులై 13 నాటికి ఇక్కడి పరిస్థితులు మరింత ఆందోళనకరంగా మారాయి. అమెరికా సైనిక రక్షణలో ఆదివారం 80 లక్షలకు పైగా బ్యారెల్ల చమురు రవాణా అయినప్పటికీ, వాణిజ్య నౌకల రాకపోకలు గణనీయంగా పడిపోయాయి. కప్లర్ సంస్థ గణాంకాల ప్రకారం, ఒమన్ తీరం వెంబడి ఉన్న సురక్షిత దక్షిణ మార్గంలో నౌకల ప్రయాణం స్తంభించింది. గత వారంతో పోలిస్తే ఆదివారం కేవలం 14 నౌకలు మాత్రమే జలసంధిని దాటాయి. ఇది 60 శాతం క్షీణతను సూచిస్తుంది. నౌకలన్నీ తన నియంత్రణలో ఉన్న ఉత్తర మార్గం (ఇరాన్ భూభాగ జలాలు) గుండానే వెళ్లాలని ఇరాన్ పట్టుబడుతోంది. ఇదే సమయంలో, ఇరాన్ నౌకలపై ఆర్థిక దిగ్బంధనం విధిస్తామని ట్రంప్ ప్రకటించారు. అంతేకాకుండా, జలసంధి దాటే ఇతర నౌకలు తమ సరుకు విలువలో 20 శాతాన్ని రక్షణ రుసుముగా అమెరికాకు చెల్లించాలని డిమాండ్ చేయడం వివాదాన్ని మరింత పెంచింది.

**దాగివున్న వ్యూహాత్మక ఎజెండాలు :**

శాంతి ఒప్పందం జరిగినప్పటికీ యుద్ధం ఎందుకు ఆగడం లేదనేదానిపై భౌగోళిక రాజకీయ విశ్లేషకులు కొన్ని కీలకమైన అంశాలను అంచనా వేస్తున్నారుహర్మూజ్ జలసంధిని శాశ్వతంగా తన ఆధీనంలో ఉంచుకోవడం ద్వారా ప్రపంచ ఇంధన సరఫరాను శాసించాలని ఇరాన్ భావిస్తోంది. అమెరికా మాత్రం దీన్ని తన ఆధీనంలోని స్వేచ్ఛా వాణిజ్య మార్గంగా మార్చాలని చూస్తోంది. ఇరాన్ తన అణు ఇంధన శుద్ధీకరణను పూర్తిగా నిలిపివేయాలని అమెరికా షరతు పెట్టింది. అయితే ఇరాన్ నూతన సర్వోన్నత నేత మొజ్తబా ఖమేనీకి, అధ్యక్షుడు పెజెష్కియాన్‌కు మధ్య ఈ విషయంలో తీవ్ర భిన్నాభిప్రాయాలు ఉన్నట్లు తెలుస్తోంది. ఒప్పందంలో లెబనాన్‌ను చేర్చినప్పటికీ, హెజ్బొల్లా తన ఆయుధాలను వదులుకోవడానికి నిరాకరించింది. ఇజ్రాయెల్, హెజ్బొల్లాలు ఈ ఒప్పందంపై నేరుగా సంతకాలు చేయకపోవడం వల్ల క్షేత్రస్థాయిలో గందరగోళం నెలకొంది. యుద్ధానికి ముందు ఇరాన్ చమురుకు చైనా ప్రధాన కొనుగోలుదారుగా ఉండేది. సుదీర్ఘ నౌకా దిగ్బంధనం ద్వారా చైనా–ఇరాన్ ఇంధన బంధాన్ని దెబ్బతీయాలని అమెరికా వ్యూహకర్తలు యోచిస్తున్నట్లు విశ్లేషకులు భావిస్తున్నారు. లొంగిపోయామనే ముద్ర పడకుండా ఇరు దేశాల నేతలు కఠిన వైఖరిని ప్రదర్శిస్తున్నారు. చర్చలు సమయం వృథా అని ట్రంప్ అంటుంటే, లొంగుబాటుతో యుద్ధం ముగియదని ఇరాన్ ప్రతినిధులు స్పష్టం చేస్తున్నారు.

**ప్రపంచ ఆర్థిక వ్యవస్థపై ప్రభావం:**

ఈ ఉదంతం వల్ల అంతర్జాతీయ చమురు మార్కెట్ తీవ్రంగా ప్రభావితమవుతోంది. బ్రెంట్ క్రూడ్ ధర జులై 10 నాటికి బ్యారెల్‌కు 76.58 డాలర్లకు చేరుకుంది. ఇది వారం రోజుల్లోనే 4 డాలర్ల పెరుగుదలను చూపించింది. చమురు సరఫరా తగ్గితే ఆగస్టు నాటికి ధరలు మరో 10 నుండి 15 డాలర్లు పెరిగే ప్రమాదం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఐక్యరాజ్యసమితి సముద్ర సంస్థ సమాచారం ప్రకారం, ప్రస్తుతం వందలాది నౌకల్లో సుమారు 6,000 మంది నావికులు చిక్కుకుపోయారు. ఐఎంఎఫ్, ప్రపంచ బ్యాంకు వంటి సంస్థలు ఆందోళన వ్యక్తం చేస్తున్నప్పటికీ, ప్రపంచ ఆర్థిక వ్యవస్థ ప్రస్తుతానికి ఈ ఒత్తిడిని తట్టుకుని నిలబడుతోందని పేర్కొన్నాయి.

**పరిష్కార మార్గాలు - భవిష్యత్తు**

ఈ సంక్షోభానికి శాశ్వత పరిష్కారం లభించాలంటే అంతర్జాతీయ పర్యవేక్షణలో జలసంధి నిర్వహణపై స్పష్టమైన, రాతపూర్వక ఒప్పందం జరగాలి. గల్ఫ్ సహకార మండలి దేశాలను ఈ చర్చల్లో భాగస్వాములను చేయడం ద్వారా నమ్మకాన్ని పెంచవచ్చు. అలాగే, దశలవారీగా ఆంక్షల ఎత్తివేత, ఐఏఈఏ ద్వారా పర్యవేక్షణ, హెజ్బొల్లా అంశంపై ప్రత్యేక చర్చలు జరపడం వంటి చర్యలు అవసరం.ప్రస్తుత పరిస్థితుల బట్టి చూస్తే, ఇరు పక్షాలు పూర్తిస్థాయి యుద్ధానికి వెళ్లే అవకాశం తక్కువగా ఉన్నప్పటికీ, ఈ పరిమిత దాడుల చక్రం మరికొంత కాలం కొనసాగే ప్రమాదం పొంచివుంది. శాంతి అనేది కేవలం కాగితాలపై సంతకాలతో రాదని, పరస్పర వ్యూహాత్మక ప్రయోజనాలను పక్కనపెట్టి నిజాయితీగా కట్టుబడినప్పుడే సాధ్యమవుతుందని ఈ సంక్షోభం నిరూపిస్తోంది.



**ప్రపంచ చమురు, గ్యాస్ సరఫరాలో ఐదో వంతు వాటా ఉన్న హర్మూజ్ జలసంధి ఈ వివాదానికి అసలు కేంద్ర బిందువు. యుద్ధానికి ముందు ఈ మార్గం గుండా రోజుకు సగటున 130 వాణిజ్య నౌకలు ప్రయాణించేవి. జూన్ నాటి "ఎంఓయూ " ఒప్పందంలో 60 రోజుల పాటు ఎటు వంటి రుసుము లేకుండా నౌకలకు సుర క్షిత మార్గం కల్పించేందుకు ఇరాన్ శాయ శక్తులా ప్రయత్నిస్తుంది అనే అస్పష్టమైన నిబంధనను చేర్చారు. భవిష్యత్తులో సర్వీస్ ఫీజు విధించే అవకాశాన్ని ఈ వాక్యం కొట్టిపారేయలేదు. దీన్ని ఆసరాగా చేసు కుని జలసంధిపై తన సార్వభౌమత్వాన్ని నిరూపించుకోవాలని ఇరాన్ చూస్తోంది. ఇరాన్ పార్లమెంట్ స్పీకర్ మహమ్మద్ ఘలిబాఫ్ మాట్లాడుతూ, హర్మూజ్ జల సంధి ఇరాన్ నిబంధనల ప్రకారమే నడు స్తుంది తప్ప, అమెరికా బెదిరింపులకు లొంగదు అని తేల్చి చెప్పారు. దీనికి భిన్నంగా అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ హెచ్చరిస్తూ, ఈ అంతర్జాతీయ జలమార్గం ఎల్లప్పుడూ తెరిచే ఉండాలని, దీన్ని మూసివేయాలని చూస్తే అమెరికా సైన్యం ఊరుకోదని స్పష్టం చేశారు.జులై 13 నాటికి ఇక్కడి పరిస్థితులు మరింత ఆందోళనకరంగా మారాయి. అమెరికా సైనిక రక్షణలో ఆదివారం 80 లక్షలకు పైగా బ్యారెల్ల చమురు రవాణా అయిన ప్పటికీ, వాణిజ్య నౌకల రాకపోకలు గణ నీయంగా పడిపోయాయి.**

# పిచ్చుకపై బ్రహ్మాస్త్రం (యూఏపీఏ) ప్రయోగం



డాక్టర్ కోలాహలం రామ్ కిశోర్
9849328496

ప్రజాస్వామ్యంలో ప్రభుత్వాన్ని ప్రశంసించడం ఎంత సహజమో, విమర్శించడం కూడా అంతే సహజం. అధికారంలో ఉన్నవారిని ప్రశ్నించే హక్కు ప్రజలకు రాజ్యాంగం కల్పించిన ప్రాథమిక స్వేచ్ఛల్లో భాగం. ఆ హక్కును వినియోగించిన ప్రతి ఒక్కరినీ శత్రువులుగా చూడటం, వారి మాటలను దేశ భద్రతకు ముప్పుగా చిత్రీకరించడం, కఠిన చట్టాలను ప్రయోగించడం ప్రజాస్వామ్య ఆత్మకు విరుద్ధం. ఇటీవల ఆంధ్రప్రదేశ్‌లో యూట్యూబర్ రావణ్‌పై అక్రమ కార్యకలాపాల నిరోధక చట్టం (యూఏపీఏ) ప్రయోగించిన ఘటన దేశవ్యాప్తంగా చర్చకు దారితీసింది. ఒక వ్యక్తి వ్యాఖ్యలు ఎంత తీవ్రమైనవైనా, వాటిని ఎదుర్కోవడానికి చట్టం పేరుతో అత్యంత కఠినమైన ఆయుధాలను ఉపయోగించడం ప్రజాస్వామ్య బలాన్ని కాకుండా, అధికార అసహనాన్ని ప్రతిబింబిస్తుందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. అన్ లాఫుల్ యాక్టివిటీస్ ప్రివెన్షన్ యాక్ట్ (యూఏపీఏ) ఉద్దేశం ... దేశ సమగ్రత, సార్వభౌమత్వం, ఉగ్రవాద కార్యకలాపాలను అరికట్టడం. ఈ చట్టం సాధారణ క్రిమినల్ చట్టాల కంటే భిన్నమైనది. ఇందులో బెయిల్ పొందడం అత్యంత క్లిష్టం. విచారణ పూర్తికాక ముందే దీర్ఘకాలం జైలులో ఉండాల్సిన పరిస్థితులు ఏర్పడుతాయి. అందుకే దీనిని "ప్రక్రియే శిక్ష" (ప్రాసెస్ ఇట్సెల్ఫ్ బికమ్స్ పనిష్మెంట్ ) అనే విమర్శ తరచూ వినిపిస్తుంది. అలాంటి చట్టాన్ని సాధారణ రాజకీయ విమర్శలు, సోషల్ మీడియా వ్యాఖ్యలు లేదా ప్రభుత్వ విధానాలపై విమర్శలు చేసిన వారిపై ప్రయోగిస్తే, అది చట్ట దుర్వినియోగంపై తీవ్రమైన ప్రశ్నలను లేవనెత్తుతుంది.దేశంలో గత కొన్ని సంవత్సరాలుగా కవులు, రచయితలు, కళాకారులు, ప్రజా గాయకులు, స్టాండప్ కమెడియన్లు, యూనివర్సిటీ ప్రొఫెసర్లు, యూట్యూబర్లు, స్వతంత్ర జర్నలిస్టులు, రాజకీయ విశ్లేషకులపై యూఏపీఏ, దేశద్రోహం వంటి కఠిన చట్టాల వినియోగం పెరిగిందనే విమర్శలు కేవలం ప్రతిపక్షాల నుంచే కాదు, మాజీ న్యాయమూర్తులు, న్యాయ వాదులు, మానవ హక్కుల సంస్థలు కూడా వ్యక్తం చేస్తున్నాయి. వివిధ నివేదికల ప్రకారం యూఏపీఏ కింద నమోదైన కేసుల్లో శిక్షల శాతం చాలా తక్కువగా ఉండగా, బెయిల్ పొందక ముందే నిందితులను సంవత్సరాల పాటు జైలులో ఉండాల్సిన పరిస్థితులు ఏర్పడుతున్నాయి. దీంతో చివరకు నిర్దోషిగా బయటకు వచ్చినా, వారి వ్యక్తిగత జీవితం, కుటుంబం, ఉపాధి, సామాజిక గౌరవం తీవ్రంగా దెబ్బతింటాయి. ఈ నేపథ్యంలో చట్టం శిక్షించకముందే, ప్రక్రియే శిక్షగా మారుతోందనే విమర్శ బలపడుతోంది.ప్రభుత్వాన్ని విమర్శించడం దేశద్రోహం కాదు. ప్రభుత్వాన్ని, దేశాన్ని ఒకటిగా చూడటం ప్రజాస్వామ్యానికి ప్రమాదకరం. ప్రభుత్వాలు ఎన్నికల ద్వారా వస్తాయి, పోతాయి. కానీ రాజ్యాంగం, ప్రజాస్వామ్యం, దేశం శాశ్వతం. ప్రభుత్వ నిర్ణయాలను విమర్శించడం అంటే దేశాన్ని వ్యతిరేకించడం కాదు. వాస్తవానికి విమర్శలే ప్రజాస్వామ్యానికి రక్షణ కవచం. అధికారంలో ఉన్నవారు చేసే తప్పులను ఎత్తిచూపే స్వేచ్ఛ లేకపోతే, అవినీతి, అధికార దుర్వినియోగం, నియంతృత్వ ధోరణులు మరింత బలపడతాయి.ఒక వ్యక్తిపై ఒకేసారి అనేక పోలీస్ స్టేషన్లలో వేర్వేరు కేసులు నమోదు చేయడం, ఒక కేసులో బెయిల్ వచ్చిన వెంటనే మరో కేసులో అరెస్టు చేయడం, పదేపదే కస్టడీలో ఉంచే ప్రయత్నాలు చేయడం వంటి పరిణామాలు ఇటీవలి కాలంలో అనేక రాష్ట్రాల్లో కనిపిస్తున్నాయి. చట్టపరంగా ప్రతి కేసుకు ప్రత్యేక పరిస్థితులు ఉండవచ్చు. అయితే ఒకే సంఘటన లేదా ఒకే తరహా వ్యాఖ్యల ఆధారంగా వరుస కేసులు నమోదు చేసి వ్యక్తిని నిరంతరం వేధించడం న్యాయస్ఫూర్తికి విరుద్ధమనే అభిప్రాయాన్ని న్యాయ నిపుణులు పలుమార్లు వ్యక్తం చేశారు. ఇలాంటి విధానాలు ప్రజల్లో చట్ట వ్యవస్థపై విశ్వాసాన్ని దెబ్బతీసే ప్రమాదం ఉంది. పోలీసు వ్యవస్థ ప్రజాస్వామ్యంలో ప్రభుత్వానికి కాదు, రాజ్యాంగానికి సేవ చేయాల్సిన సంస్థ. చట్టాన్ని అమలు చేసే ప్రతి అధికారి రాజకీయ ఒత్తిళ్లకు అతీతంగా వ్యవహరించాలి. నేరం నిజంగా ఉగ్రవాదానికి సంబంధించినదా? దేశ భద్రతకు వాస్తవ ప్రమాదమా? లేక కేవలం ఘాటైన రాజకీయ విమర్శేనా? అనే అంశాలను అత్యంత జాగ్రత్తగా పరిశీలించకుండా యూఏపీఏ వంటి చట్టాలను ప్రయోగించడం వల్ల చివరకు చట్టం విశ్వసనీయతే దెబ్బతింటుంది.రాజకీయ నాయకులు కూడా అధికారాన్ని విమర్శలను అణచివేయడానికి కాకుండా, వాటికి సమాధానం చెప్పడానికి వినియోగించాలి. ప్రజాస్వామ్యంలో విమర్శకు సమాధానం మరొక వాదన కావాలి; కేసు కాదు. అసత్య ప్రచారం జరిగితే పరువు నష్టం చట్టాలు ఉన్నాయి. ద్వేష ప్రసంగం ఉంటే భారతీయ న్యాయ సంహిత (బీఎన్ఎస్)లో తగిన నిబంధనలు ఉన్నాయి. కానీ ప్రతి రాజకీయ విమర్శను ఉగ్రవాదానికి అనుసంధానం చేయడం చట్టం ఉద్దేశాన్ని వక్రీకరించినట్లే అవుతుంది.అదే సమయంలో సోషల్ మీడియా కార్యకర్తలు, యూట్యూబర్లు, రాజకీయ వ్యాఖ్యాతలు కూడా తమ బాధ్యతను గుర్తుంచుకోవాలి. భావ ప్రకటన స్వేచ్ఛకు రాజ్యాంగం రక్షణ కల్పించినప్పటికీ, అది అపరిమిత హక్కు కాదు. వ్యక్తిగత దూషణలు, నిరాధార ఆరోపణలు, హింసను ప్రేరేపించే వ్యాఖ్యలు, తప్పుడు సమాచార ప్రచారం ప్రజాస్వామ్యానికి కూడా హానికరమే. విమర్శ వాస్తవాల ఆధారంగా, బాధ్యతాయుతంగా ఉండాలి. ప్రజల విశ్వాసం సంపాదించేది సంచలనంతో కాదు, విశ్వసనీయతతో.

ఈ మొత్తం పరిణామంలో అత్యంత కీలకమైన పాత్ర న్యాయవ్యవస్థదే. వ్యక్తిగత స్వేచ్ఛ, రాజ్యాంగ హక్కుల పరిరక్షణలో సుప్రీంకోర్టు, హైకోర్టులు గతంలో అనేక చారిత్రాత్మక తీర్పులు ఇచ్చాయి. యూఏపీఏ వంటి కఠిన చట్టాల దుర్వినియోగంపై కూడా స్పష్టమైన మార్గదర్శకాలు అవసరమని న్యాయవాదులు, పౌర సమాజ సంస్థలు చాలాకాలంగా కోరుతున్నాయి. ఒక వ్యక్తిపై ఒకే తరహా ఆరోపణలతో వరుసగా అనేక కేసులు నమోదు చేసే ధోరణిపై కూడా అత్యున్నత న్యాయస్థానం స్పష్టమైన ప్రమాణాలను రూపొందించాల్సిన అవసరం ఉంది. అలా జరిగితే చట్టబద్ధమైన దర్యాప్తుకు ఆటంకం కలగదు; అదే సమయంలో పౌర హక్కుల దుర్వినియోగం కూడా తగ్గుతుంది.



ప్రజాస్వామ్యం బలపడేది భయంతో కాదు, భిన్నాభిప్రాయాలతో. ప్రభుత్వం విమర్శలను శత్రుత్వంగా కాకుండా ప్రజల స్పందనగా స్వీకరిస్తే పాలన మెరుగుపడుతుంది. పోలీసులు రాజ్యాంగ నిబద్ధతతో వ్యవహరిస్తే చట్టంపై గౌరవం పెరుగుతుంది. రాజకీయ నాయకులు సహనాన్ని ప్రదర్శిస్తే ప్రజాస్వామ్య సంస్కృతి బలపడుతుంది. మీడియా, యూట్యూబర్లు బాధ్యతాయుతమైన విమర్శలు చేస్తే ప్రజల విశ్వాసం పెరుగుతుంది. న్యాయవ్యవస్థ పౌర స్వేచ్ఛలను దృఢంగా కాపాడితే రాజ్యాంగం మరింత సజీవంగా ఉంటుంది.ప్రజాస్వామ్యంలో "పిచ్చుక పై బ్రహ్మాస్త్రం" ప్రయోగించడం పాలకుల బలానికి సంకేతం కాదు; అసహనానికి, అసమర్థతకు నిదర్శనం. ప్రజల ప్రశ్నలకు సమాధానం చట్టాల బెదిరింపులు కాదు, పారదర్శక పాలన. విమర్శలను అణచివేసే ప్రభుత్వాలు తాత్కాలికంగా నిశ్శబ్దాన్ని సృష్టించవచ్చు; కానీ ఆ నిశ్శబ్దం ప్రజాస్వామ్య ఆరోగ్యానికి ప్రమాదకరం. ప్రశ్నించే గొంతులను రక్షించినప్పుడే రాజ్యాంగం బతుకుతుంది. భిన్నాభిప్రాయాలకు స్థానం కల్పించినప్పుడే ప్రజాస్వామ్యం నిజమైన అర్థంలో ఊపిరి పీలుస్తుంది.

వాస్తవం



# ఆదిలోనే హంస పాదు హెల్త్ కార్డులు ఎక్కడ?




- డిజిటల్ హెల్త్ కార్డులు ఇంకా అందని వైనం
- నెట్‌వర్క్ ఆసుపత్రులతో పూర్తికాని ఒప్పందాలు
- సిద్ధం కాని మార్గదర్శకాలు

**ప్రభుత్వం ఒక పథకాన్ని ప్రకటించినప్పుడు ప్రజలు కేవలం ప్రకటనను కాదు, దాని వెనుక ఉన్న నమ్మకాన్ని విశ్వసిస్తారు. ముఖ్యంగా ప్రభుత్వ ఉద్యోగులు, పదవీ విరమణ చేసిన పెన్షనర్లు వంటి వర్గాలకు సంబంధించిన సంక్షేమ పథకాల విషయంలో ప్రభుత్వం ఇచ్చే హామీ ఒక పరిపాలనా ప్రకటన మాత్రమే కాదు, వారి జీవిత భద్రతకు ఇచ్చే హామీ కూడా. అలాంటి అత్యంత కీలకమైన ఆరోగ్య భద్రతా పథకమైన ఎంప్లాయీస్ హెల్త్ స్కీమ్ (ఈహెచ్ఎస్) అమలులో తెలంగాణ ప్రభుత్వం చూపిన నిర్లక్ష్యం మరోసారి ప్రభుత్వ వాగ్దానాల విశ్వసనీయతపై ప్రశ్నలు లేవనెత్తుతోంది. ప్రకటించిన తేదీకి డిజిటల్ హెల్త్ కార్డులు అందించలేకపోవడం, నెట్‌వర్క్ ఆసుపత్రులతో ఒప్పందాలు పూర్తి చేయకపోవడం, అమలు మార్గదర్శకాలు కూడా సిద్ధం చేయకపోవడం పరిపాలనా వైఫల్యానికి స్పష్టమైన ఉదాహరణ.**

**ప్రభుత్వ ఉద్యోగులు ప్రత్యేక సౌకర్యాలు కోరడం లేదు. వారి జీతాల నుంచి ప్రభుత్వం వసూలు చేస్తున్న నిధులకు తగిన సేవలు మాత్రమే కోరుతున్నారు. పెన్షనర్లు అదనపు వరాలు అడగడం లేదు. వృద్ధాప్యంలో అనారోగ్య భారాన్ని తగ్గించే కనీస ఆరోగ్య భద్రత మాత్రమే కోరుతున్నారు. ఇది వారి హక్కు, ప్రభుత్వ దయాదాక్షిణ్యం కాదు. అందువల్ల తెలంగాణ ప్రభుత్వం ఇకపై ఆలస్యం చేయకుండా ఈ హెల్త్ కార్డుల వ్యవహారాన్ని అత్యున్నత ప్రాధాన్యంతో తీసుకోవాలి. ముఖ్యమంత్రి స్వయంగా జోక్యం చేసుకుని నెట్‌వర్క్ ఆసుపత్రులు, ఉద్యోగ సంఘాలు, సంబంధిత అధికారులతో అత్యవసర సమావేశం నిర్వహించి అన్ని వివాదాలకు ముగింపు పలకాలి. ప్రకటించిన పథకం కాగితాలకే పరిమితం కాకుండా ప్రతి ఉద్యోగి, ప్రతి పెన్షనర్ చేతిలో పనిచేసే హెల్త్ కార్డుగా, అవసరమైన సమయంలో అందుబాటులో ఉండే నాణ్యమైన వైద్య సేవగా మారినప్పుడే ప్రభుత్వం ఇచ్చిన హామీకి నిజమైన అర్థం ఉంటుంది. అదే ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టే పరిపాలనకు అసలైన ప్రమాణం.**

ప్రభుత్వం ఒక పథకాన్ని ప్రకటించినప్పుడు ప్రజలు కేవలం ప్రకటనను కాదు, దాని వెనుక ఉన్న నమ్మకాన్ని విశ్వసిస్తారు. ముఖ్యంగా ప్రభుత్వ ఉద్యోగులు, పదవీ విరమణ చేసిన పెన్షనర్లు వంటి వర్గాలకు సంబంధించిన సంక్షేమ పథకాల విషయంలో ప్రభుత్వం ఇచ్చే హామీ ఒక పరిపాలనా ప్రకటన మాత్రమే కాదు, వారి జీవిత భద్రతకు ఇచ్చే హామీ కూడా. అలాంటి అత్యంత కీలకమైన ఆరోగ్య భద్రతా పథకమైన ఎంప్లాయీస్ హెల్త్ స్కీమ్ (ఈహెచ్ఎస్) అమలులో తెలంగాణ ప్రభుత్వం చూపిన నిర్లక్ష్యం మరోసారి ప్రభుత్వ వాగ్దానాల విశ్వసనీయతపై ప్రశ్నలు లేవనెత్తుతోంది. ప్రకటించిన తేదీకి డిజిటల్ హెల్త్ కార్డులు అందించలేకపోవడం, నెట్‌వర్క్ ఆసుపత్రులతో ఒప్పందాలు పూర్తి చేయకపోవడం, అమలు మార్గదర్శకాలు కూడా సిద్ధం చేయకపోవడం పరిపాలనా వైఫల్యానికి స్పష్టమైన ఉదాహరణ. ఆరోగ్య భద్రత అనేది ఉద్యోగులకు ప్రభుత్వం ఇచ్చే జీతభత్యాల కంటే తక్కువ ప్రాధాన్యం ఉన్న అంశం కాదు. ఉద్యోగ జీవితమంతా ప్రభుత్వానికి సేవ చేసిన వ్యక్తులు వృద్ధాప్యంలో ఎక్కువగా ఎదుర్కొనేది అనారోగ్య సమస్యలనే. గుండె జబ్బులు, మధుమేహం, మూత్రపిండాల వ్యాధులు, క్యాన్సర్, కీళ్ల సమస్యలు వంటి దీర్ఘకాలిక వ్యాధులు పెన్షనర్లలో అధికంగా కనిపిస్తాయి. ఇలాంటి పరిస్థితుల్లో నగదు రహిత వైద్య సేవలు వారికి విలాసం కాదు, జీవనావసరం. ఒకసారి పెద్ద ఆసుపత్రిలో చికిత్స అవసరమైతే లక్షల రూపాయల ఖర్చు అవుతోంది. భారత దేశంలో మొత్తం ఆరోగ్య వ్యయంలో ఇప్పటికీ కుటుంబాలే నేరుగా భరించే వ్యయం సుమారు నలభై శాతం వరకు ఉందని వివిధ ఆరోగ్య అధ్యయనాలు సూచిస్తున్నాయి.

అనారోగ్యం కారణంగా ప్రతి సంవత్సరం లక్షలాది కుటుంబాలు అప్పుల పాలవుతున్నాయి. ఈ వాస్తవాలను దృష్టిలో పెట్టుకుంటే ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లకు బలమైన ఆరోగ్య భద్రతా వ్యవస్థ కల్పించడం ప్రభుత్వ ప్రాథమిక బాధ్యత. ఇక్కడ మరింత ఆందోళన కలిగించే విషయం ఏమిటంటే, ప్రభుత్వం ఉద్యోగులు, పెన్షనర్ల జీతాలు, పెన్షన్ల నుంచి ఆరోగ్య పథకం కోసం విరాళాల రూపంలో మొత్తాలను మినహాయించడం ప్రారంభించింది. ఉద్యోగులు తమ వంతు బాధ్యతను నిర్వర్తించారు.

అయితే ప్రభుత్వం మాత్రం అదే స్థాయిలో తన బాధ్యతను నిర్వర్తించలేకపోయింది. నిధులు వసూలు చేసి సేవలు అందించకపోతే అది పరిపాలనా వైఫల్యమే కాకుండా నైతిక ప్రశ్న కూడా అవుతుంది. ఉద్యోగుల నుంచి డబ్బు తీసుకోవడంలో చూపిన వేగం, వారికి హెల్త్ కార్డులు ఇవ్వడంలో ఎందుకు కనిపించలేదు అనే ప్రశ్నకు ప్రభుత్వం సమాధానం చెప్పాల్సిందే. ఇంకా ఒక కీలకమైన అంశం ప్రైవేట్ నెట్‌వర్క్ ఆసుపత్రుల అభ్యంతరాలు. ప్రభుత్వం నిర్ణయించిన ప్యాకేజీ ధరలు ప్రస్తుత వైద్య ఖర్చులకు సరిపోవని ఆసుపత్రులు చెబుతున్నాయి. ఒకవైపు ప్రభుత్వం ఖర్చు నియంత్రించాలని చూస్తుంటే, మరోవైపు ఆసుపత్రులు తమ నిర్వహణ వ్యయాలను చూపుతున్నాయి. ఈ రెండు వర్గాల మధ్య సమన్వయం సాధించకుండా పథకాన్ని ప్రకటించడం ముందుచూపు లేని నిర్ణయం. ఆసుపత్రులు సేవలు అందించకపోతే హెల్త్ కార్డులు చేతిలో ఉన్నా ఉద్యోగులకు ఎలాంటి ప్రయోజనం ఉండదు. అందువల్ల ఈ సమస్యను పరస్పర చర్చల ద్వారానే పరిష్కరించాలి. ప్రభుత్వం, వైద్య నిపుణులు, నెట్‌వర్క్ ఆసుపత్రుల ప్రతినిధులు, ఉద్యోగ సంఘాల మధ్య పారదర్శకమైన చర్చలు జరగాల్సిన అవసరం ఉంది. ఇక్కడ ప్రభుత్వం గుర్తుంచుకోవాల్సిన మరో వాస్తవం ఏమిటంటే, ప్రభుత్వ ఉద్యోగి కూడా చివరకు ఒక సాధారణ పౌరుడే.

అతను తన జీవితంలో అత్యంత ఉత్పాదకమైన కాలాన్ని ప్రభుత్వ సేవకు అంకితం చేస్తాడు. పదవీ విరమణ తర్వాత అతనికి అవసరమయ్యేది కొత్త హామీలు కాదు, ఇప్పటికే ఇచ్చిన హామీల అమలు. ముఖ్యంగా వృద్ధాప్యంలో ఆసుపత్రుల చుట్టూ తిరిగే పరిస్థితి రాకుండా ఆరోగ్య భద్రత కల్పించడం సంక్షేమ ప్రభుత్వ లక్షణం. హెల్త్ కార్డు లేక అత్యవసర చికిత్స ఆలస్యమైతే దాని ప్రభావం కేవలం ఆర్థిక నష్టం మాత్రమే కాదు, ప్రాణనష్టం కూడా కావచ్చు. తెలంగాణ ప్రభుత్వం సంక్షేమ రాష్ట్రంగా తనను తాను తరచూ ప్రకటించుకుంటుంది. అలాంటప్పుడు సంక్షేమం అంటే కొత్త పథకాల ప్రకటనలు మాత్రమే కాదు, ప్రకటించిన పథకాలను సమర్థవంతంగా అమలు చేయడం కూడా. ప్రతి పథకం ప్రారంభోత్సవం ఒక ప్రచార కార్యక్రమంగా మారి, అమలు మాత్రం నిరవధికంగా వాయిదా పడితే ప్రభుత్వంపై విశ్వసనీయత దెబ్బతింటుంది. ఉద్యోగులు, పెన్షనర్లు ప్రభుత్వానికి వ్యతిరేకులు కాదు. వారు ప్రభుత్వ యంత్రాంగంలో భాగస్వాములు. వారి నమ్మకాన్ని కోల్పోతే పరిపాలనా వ్యవస్థపై కూడా దాని ప్రభావం పడుతుంది. ఈ సమస్యకు పరిష్కారం కూడా అంత క్లిష్టమైనది కాదు.

ముందుగా ప్రభుత్వం డిజిటల్ హెల్త్ కార్డుల జారీకి ఖచ్చితమైన గడువును ప్రకటించి, ఆ గడువును తప్పకుండా పాటించాలి. ఉద్యోగులు, పెన్షనర్ల నుంచి మినహాయించిన నిధుల వినియోగంపై పూర్తి పారదర్శకత చూపాలి. నెట్‌వర్క్ ఆసుపత్రుల పెండింగ్ బకాయిలను దశలవారీగా చెల్లించే కార్యాచరణ ప్రకటించాలి. వైద్య సేవల ప్యాకేజీ ధరలను శాస్త్రీయ అధ్యయనం ఆధారంగా పునఃసమీక్షించాలి. అత్యవసర చికిత్సలకు ఎలాంటి అంతరాయం కలగకుండా తాత్కాలిక ఏర్పాట్లు చేయాలి. ఫిర్యాదులను వెంటనే పరిష్కరించే ప్రత్యేక హెల్ప్‌డెస్క్, ఆన్‌లైన్ వ్యవస్థను ఏర్పాటు చేయాలి. ప్రతి జిల్లాలో సమన్వయ అధికారులను నియమించి ఉద్యోగులు ఎదుర్కొనే సమస్యలను తక్షణమే పరిష్కరించే విధానం తీసుకురావాలి.

ముఖ్యమంత్రి స్వయంగా ఈ అంశాన్ని సమీక్షించడం కూడా అవసరం. ఎందుకంటే ఇది కేవలం ఒక శాఖకు సంబంధించిన పరిపాలనా సమస్య కాదు. లక్షలాది ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లు, వారి కుటుంబాల ఆరోగ్య భద్రతకు సంబంధించిన సామాజిక బాధ్యత. ప్రభుత్వం ఇచ్చిన మాట నిలబెట్టుకోవడం ప్రజాస్వామ్య పాలనలో కనీస ప్రమాణం. ఆ ప్రమాణాన్ని నిలబెట్టడంలో విఫలమైతే ప్రజల విశ్వాసం క్రమంగా దెబ్బతింటుంది.

ప్రభుత్వ ఉద్యోగులు ప్రత్యేక సౌకర్యాలు కోరడం లేదు. వారి జీతాల నుంచి ప్రభుత్వం వసూలు చేస్తున్న నిధులకు తగిన సేవలు మాత్రమే కోరుతున్నారు. పెన్షనర్లు అదనపు వరాలు అడగడం లేదు. వృద్ధాప్యంలో అనారోగ్య భారాన్ని తగ్గించే కనీస ఆరోగ్య భద్రత మాత్రమే కోరుతున్నారు. ఇది వారి హక్కు, ప్రభుత్వ దయాదాక్షిణ్యం కాదు. అందువల్ల తెలంగాణ ప్రభుత్వం ఇకపై ఆలస్యం చేయకుండా ఈ హెల్త్ కార్డుల వ్యవహారాన్ని అత్యున్నత ప్రాధాన్యంతో తీసుకోవాలి. ముఖ్యమంత్రి స్వయంగా జోక్యం చేసుకుని నెట్‌వర్క్ ఆసుపత్రులు, ఉద్యోగ సంఘాలు, సంబంధిత అధికారులతో అత్యవసర సమావేశం నిర్వహించి అన్ని వివాదాలకు ముగింపు పలకాలి. ప్రకటించిన పథకం కాగితాలకే పరిమితం కాకుండా ప్రతి ఉద్యోగి, ప్రతి పెన్షనర్ చేతిలో పనిచేసే హెల్త్ కార్డుగా, అవసరమైన సమయంలో అందుబాటులో ఉండే నాణ్యమైన వైద్య సేవగా మారినప్పుడే ప్రభుత్వం ఇచ్చిన హామీకి నిజమైన అర్థం ఉంటుంది. అదే ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టే పరిపాలనకు అసలైన ప్రమాణం.



డాక్టర్ కోలాహలం రామ్ కిశోర్
9849328496